గురువారం
06-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 345
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హమాస్ చెరలోని మరో నలుగురి మృతి

జెరూసలేం: హమాస్ చెరలో ఉన్న వారిలో మరో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇటీవల ఖాన్ యూనియస్‌లో చేపట్టిన ఆపరేషన్ క్రమంలో ఈ నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. వారి మృతదేహాలు ఇంకా హమాస్ వద్దనే ఉన్నట్లు తెలిపింది. గాజాలో 80 మంది బందీలుగా ఉన్నారని ఇజ్రాయిల్ సైనిక వర్గాలు చెబుతున్నాయి. ఇంకో 43 మంది చనిపోయారని, వారి అవశేషాలు హమాస్ వద్దనే ఉన్నాయని భావిస్తున్నారు.

ఎన్డీఏ పక్ష నేత మోదీ

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న భాగస్వామ్య పక్షాలు
- మద్దతు లేఖలు సమర్పించిన నితీశ్, చంద్రబాబు, పవన్
- రేపు మరోసారి భేటీ... హాజరు కానున్న కూటమి ఎంపీలు
- ప్రభుత్వ ఏర్పాటుపై రాష్ట్రపతిని కోరనున్న నేతలు
- 9న నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ: జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) పక్ష నేతగా నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాని నివాసంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్డీఏ పక్షాల నేతలు మోదీని ఎన్నుకున్నారు. ఇందు కోసం చేసిన తీర్మానంపై టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ నేత నితీశ్‌కుమార్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సహా 21 మంది నేతలు సంతకాలు చేశారు. సుమారు 16 భాగస్వామ్య పార్టీలు ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు లేఖలను అందించాయి. కాగా ఈ నెల 7వతేదీ శుక్రవారం మరోసారి ఎన్డీఏ పక్షాలు భేటీ కాబోతున్నాయి. దీనికి ఆయా పక్షాల నుంచి గెలుపొందిన ఎంపీలు కూడా హాజరవుతారు. అదేరోజు బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుండగా... అనంతరం ఎన్డీఏ పక్షాల సమావేశం జరుగనుంది. ఆ తర్వాత ఎన్డీఏ నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీఏ కూటమిని ఆహ్వానించాలని కోరనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన బలం తమకు ఉందని చెబుతూ భాగస్వామ్య పార్టీల మద్దతుతో కూడిన లేఖను రాష్ట్రపతికి అందజేస్తారు. రాష్ట్రపతి సానుకూలంగా స్పందిస్తే... ఈ నెల 9వ తేదీన నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. తొలుత ఎన్డీఏ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూటమి పార్టీలు సుదీర్ఘంగా చర్చించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీనియర్ నేతలు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, నితీశ్ కుమార్, చిరాగ్ పాశ్వాన్, ఏక్‌నాథ్ షిండే తదితర నేతలు పాల్గొన్నారు. ఆర్ఎల్డీ, యూపీపీఎల్, హిందుస్తాన్ అవామీ మోర్చా తదితర పార్టీలకు చెందిన నేతలు కూడా పాల్గొన్నారు. ఎన్నికల ఫలితాలు, తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ ఏర్పాటుపై నేతలు గంటన్నరపాటు చర్చించారు. ఈ సమావేశంలో కీలక తీర్మానాలు ఆమోదించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ ప్రజా సంక్షేమ విధానాల వల్ల గత 10 ఏళ్లలో 140 కోట్ల మంది పౌరులున్న భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పేదలు, మహిళలు, యువత, రైతులు, దోపిడీకి గురవుతున్న అణగారిన వర్గాలకు, అణచివేతకు గురైన భారతీయ పౌరులకు సేవ చేయడానికి కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. భారతదేశ వారసత్వాన్ని పరిరక్షించడం ద్వారా భారతదేశం సర్వతోముఖాభివృద్ధి కోసం భారతదేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఎన్డీఏ

- మిగతా 2 లో

సరైన సమయంలో నిర్ణయం

- కలిసివచ్చే పార్టీలను స్వాగతిస్తాం
- ఫాసిస్టు పాలనపై ఐక్యపోరు ఆగదు
- ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం
- 'ఇండియా' భేటీలో మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిర్ణయాత్మక తీర్పు ఇచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'ఇండియా' ఐక్య సంఘటన సమన్వయంతో ముందుకెళుతుందని, ఐక్య గళం వినిపిస్తుందని, ఫాసిస్టు పాలనపై పోరాటం కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలుకు 'ఇండియా' కట్టుబడి ఉందన్నారు. భావసారూప్యతగల, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు కట్టుబడే పార్టీలను 'ఇండియా' స్వాగతిస్తుందని అన్నారు. నైతిక ఓటమి తర్వాత కూడా మోదీ నిరంకుశ వైఖరిలో మార్పు లేదని, ప్రజా తీర్పును అణచివేయాలని చూస్తున్నారని ఖర్గే విమర్శించారు. బీజేపీ పాలనను ప్రజలు కోరుకోవడం లేదని, దీనిపై సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన క్రమంలో 'ఇండియా' ఐక్య సంఘటన బుధవారం ఖర్గే నివాసంలో భేటీ అయింది. ప్రభుత్వం ఏర్పాటునకు గల అవకాశాలు, భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరిపింది. దాదాపు రెండు గంటలు సాగిన భేటీలో ప్రస్తుత రాజకీయ

- మిగతా 2 లో

పాలకుడు ఎలా ఉండకూడదో

జగన్ పాలన ఒక నమూనా

- ఐదేళ్ల పాలనలో 30 ఏళ్ల విధ్వంసం
- ప్రజలు పూర్తిగా స్వేచ్ఛ కోల్పోయారు
- అందుకే కూటమికి చారిత్రాత్మక విజయం
- టీడీపీ అధినేత చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పాలకుడు ఎలా ఉండకూడదో జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన ఒక నమూనా అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజలు గెలవాలి... రాష్ట్రం నిలవాలి అనే మా పిలుపునకు ప్రజలు అనూహ్య మద్దతిచ్చారని, కూటమి నేతలు, కార్య కర్తల సమష్టి కృషి వల్లే ఈ చారిత్రాత్మక విజయం దక్కిందన్నారు. ప్రజలు ఇచ్చింది అధికారం మాత్రమే కాదని, ఇది మాపై మోపిన ఒక ఉన్నతమైన బాధ్యత అని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మొదటి సారి ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ నా సుదీర్ఘ రాజకీయ యాత్రలో వైసీపీ

- మిగతా 2 లో

ఏక పార్టీ పాలనకు

వ్యతిరేక తీర్పు

సీపీఐ

న్యూఢిల్లీ: 'ఇండియా' భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు మెరుగ్గా జరిగి, ఐక్యంగా ప్రచారం చేసివుంటే మరింత మెరుగైన ఫలితాలు వచ్చివుండేవని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శివర్గం బుధవారం ఒక ప్రకటన చేసింది. అంతేకాకుండా బీజేపీ స్థానాలను మరింతగా కొల్లగొట్టివుండేవాళ్లమని పేర్కొంది. బీజేపీకి సవాల్ విసురుతూ 'ఇండియా' కోసం ఓటు వేసిన ప్రతి ఒక్కరిని అభినందించింది. అదే సమయంలో మెరుగైన ఫలితాలు సాధించిన ఇండియా ఐక్య సంఘటన పార్టీలకు శుభాకాంక్షలు తెలిపింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ద్వారా ఏక పార్టీ ఆధిపత్యానికి అడ్డుకట్ట పడిందని సీపీఐ ప్రకటన పేర్కొంది. కార్పొరేట్ మద్దతుగల బీజేపీ

- మిగతా 2 లో

మళ్లీ సంకీర్ణ శకం

- మోదీ ఎన్ని వేషాలు వేసినా 400 సీట్లు రాలేదు
- చంద్రబాబు, నితీశ్ మద్దతు లేకుండా ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యం
- అయోధ్యలోనూ బీజేపీని ఓడించారు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రధాని మోదీ ఎన్ని వేషాలు వేసినా బీజేపీ ప్రకటించిన 400 సీట్లు సాధించలేకపోయిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ మద్దతు లేకుండా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి బీజేపీకి లేదని, మోదీ ప్రధాని కాలేరని చెప్పారు. చివరకు రామాలయం నిర్మించామని గొప్పగా ప్రచారం చేసుకున్న అయోధ్యలోనే బీజేపీని ప్రజలు ఓడించారని నారాయణ అన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన మొట్టమొదటి ప్రధాని మోదీయేనని, ఆయన హయాంలో అవినీతి, కుంభకోణాలు పెరిగాయని విమర్శించారు. మతోన్మాదాన్ని పెంచి పోషించిన మోదీకి, బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలన్నా... లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలు బలపడాలన్నా... నిబద్ధతగల రాజకీయ పార్టీలు అవసరమన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి నారాయణ మాట్లాడారు. అనేక రాష్ట్రాల లో బీజేపీకి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలను కాంగ్రెస్ పార్టీ కలుపుకుపోలేదని, ఏకపక్షంగా వ్యవహరించిందని నారాయణ

- మిగతా 2 లో

మంత్రి పదవులు ఎవరికి?

- పవన్ కల్యాణ్ పాత్ర ఏంటి?
- లెక్కలేస్తున్న కూటమి ఎమ్మెల్యేలు
- 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- అదేరోజు కొందరు మంత్రులుగా...

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికల ఫలితాలు తేలిపోవడంతో ఇక రాష్ట్ర మంత్రివర్గ కూర్పుపై కూటమి నేతలు దృష్టి సారించారు. మంత్రివర్గంలో ఎవరెవరికి పదవులు దక్కే అవకాశం ఉందో ఎమ్మెల్యేలు కులాల వారీ లెక్కలేసుకుంటున్నారు. టీడీపీలో సీనియర్లు ఎవరెవరున్నారు? వారిలో సామాజిక

- మిగతా 2 లో

మా జీతాలు పెంచండి

నైజీరియాలో కార్మికుల సమ్మె

2లో

ఇదీ లోకం!



రంగులు మార్చడం మీకు అలవాటే కదా! వెళ్ళి, గెలిచినవాళ్ళకి బొకేలిచ్చి రంగులు వేసే కాంట్రాక్ట్ తెచ్చుకోండి!

ఫైళ్లు మాయం!

- పోలీసుల ఆధీనంలో 'ఈ-ఆఫీస్'
- ఫైళ్ల కదలికలపై విస్తృత తనిఖీలు
- కీలక దస్త్రాల ప్రక్రియ నిలుపుదల



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ఐటీ శాఖ అధ్వర్యంలో నడిచే ఈ-ఆఫీస్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాళం వేసి లాగిన్ ఐడీలు క్లోజ్ చేశారు. సీఎం కార్యాలయానికి చెందిన ఫైళ్లు ఈ-ఆఫీస్ నుంచి మాయం చేస్తున్నారని డీజీపీకి ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ క్రైమ్, ఇతర పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. గత వారం రోజుల నుంచి జరిగిన ఫైళ్ల కదలికలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు ఫైళ్లు చించి వేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ హేమచంద్రారెడ్డి, కొన్ని

- మిగతా 2 లో

ఏపీ అసెంబ్లీ రద్దు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీని రద్దు చేస్తూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆర్టికల్ 174 ప్రకారం మంత్రివర్గం సిఫార్సు మేరకు ఏపీ శాసనసభను రద్దు చేస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందాయి. దీంతో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 9 లేదా 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కేంద్రంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశం మరలా 9వ తేదీ ఉన్న నేపథ్యంలో చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం 12వ తేదీకి వాయిదా పడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

75 ఏళ్ల ఫిజీ ప్రధానికి అంతర్జాతీయ క్రీడల్లో కాంస్య పతకం

వెల్లింగ్టన్: ఫిజీ ప్రధాని సిటివెనీ రబుకా (75) ఇంటర్నెషనల్ అథెలెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. కుర్రాడిగా రగ్బీ ఆడిన ఈయన ఏడు పదుల వయస్సు దాటినా అథెలెటిక్‌గా కొనసాగుతున్నారు. సువాలో తన వయస్సు వారి కోసం నిర్వహించిన ఓషియానియా చాంపియన్‌షిప్‌లలో పాల్గొని విజేతగా నిలిచారు. 75 ఏళ్ల వయస్సులో క్రీడాల్లో రాణించడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని, శారీర దృఢత్వాన్ని కలిగివుండాలని యువతకు సందేశం ఇవ్వగలనని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయం తనలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని చెప్పారు. పతకం సాధించిన ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ప్రపంచ నాయకులు క్రీడల్లో పాల్గొనడం కొత్త కాకపోయిన అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించడం అరుదు. ఈయన షార్ట్‌పుట్‌ను 7.09 మీటర్ల దూరం విసిరి మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. మొదటి రెండు స్థానాల్లో ఇద్దరు ఆస్ట్రేలియన్లు నిలిచారు.

మా జీతాలు పెంచండి

నైజీరియాలో కార్మికుల సమ్మె

అబుజా: తమ జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నైజీరియాలోని కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెను చేపట్టాయి. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు సమ్మెను విరమించేది లేదని తేల్చిచెప్పాయి. కనీస వేతనంపై చర్చలకు డిమాండ్ చేశాయి. నైజీరియాలోని రెండు పెద్ద యూనియన్ సమాఖ్యలు 'ది నైజీరియన్ లేబర్ కాంగ్రెస్ (ఎన్ఎల్‌సీ), ది ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (టీయూసీ) అధ్వర్యంలో సమ్మె కారణంగా దేశంలో విమానాల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. నేషనల్ గ్రిడ్‌ను కట్టేయడంతో ఇబ్బంది ఎదురైంది. ఆర్థిక సంక్షోభం, పెరిగిన ద్రవ్యోల్బణం దృష్ట్యా జీతాలు పెంచకపోతే తాము ఎలా బతకాలని కార్మికులు ప్రశ్నించారు. జీవ వ్యయం పెరిగిన కారణంగా చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారమవుతోందని వాపోయారు. మనుగడ కష్టసాధ్యమైందని కనీస వేతనాన్ని 16 రెట్లు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. జీవన స్థితిగతులను మెరుగు పర్చడం కోసం జీతాలు పెంచాలని కోరాయి. నైజీరియాలో కార్మికుల నెలసరి వేతనం 30,000 నైరా కాగా దీనిని 16రెట్లు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. జీతాలు పెంచుతామని నైజీరియా ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు హామీనిచ్చినా అవి సంతృప్తికరంగా లేకపోవడంతో కార్మికులు సమ్మెబాట పట్టారు.

రెట్టింపు జీతమిచ్చేందుకు ప్రభుత్వ అంగీకారం

కార్మికుల సమ్మె కారణంగా విద్యుత్ సరఫరాకు, విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిన దృష్ట్యా నైజీరియా ప్రభుత్వం జాతీయ కనీస వేతనాన్ని రెట్టింపు చేసేందుకు అంగీకరించింది. అంటే నెలకు 30వేల నైరాకు బదులు 60వేల నైరా చెల్లిస్తామని పేర్కొంది. అయితే కనీస వేతనాన్ని 30వేల నైరా నుంచి 4,94,000కు అంటే 16 రెట్లు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రస్తుతం ప్రభుత్వం జీతాన్ని రెట్టింపు చేసేందుకు అంగీకరించడంలో సమ్మెను విరమిస్తూ తాజా ప్రకటన వెలువరించాయి. ప్రభుత్వంతో చర్చలు జరిపిన తర్వాత సంతృప్తి చెందని పక్షంలో మళ్లీ సమ్మెబాట పడతామని హెచ్చరించాయి.

స్వతంత్ర సార్వభౌమ దేశం పలస్తీనా: స్లోవేనియా

లుబేను: పలస్తీనాను ఒక దేశంగా అధికారికంగా గుర్తిస్తున్నట్లు స్లోవేనియా ప్రకటించింది. పార్లమెంటులో ఈ మేరకు చేసిన ప్రతిపాదనపై ఓటింగ్ జరుగగా 90లో నుంచి 52 మంది సభ్యులు మద్దతిచ్చారు. స్పెయిన్, నార్వే, ఐర్లాండ్ తర్వాత పలస్తీనాకు దేశ హోదా కల్పిస్తూ ప్రకటించిన నాల్గో యూరోపియన్ దేశంగా స్లోవేనియా నిలిచింది. ఈ దేశం ఐరాస భద్రతా మండలిలో నాన్-పర్మనెంట్ సభ్యత్వాన్ని కలిగివున్నది. పలస్తీనాను స్వతంత్ర సార్వభౌమ దేశంగా రిపబ్లిక్ ఆఫ్ స్లోవేనియా గుర్తిస్తున్నట్లు సభలో ఓటింగ్ అనంతరం స్పీకర్ ఉర్స్క క్లకోకర్ జుపాన్సిక్ తెలిపారు. శాంతి దిశగా, రెండు దేశాల పరిష్కాం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జింబాబ్వేలో ఆకలి కేకలు

429 మిలియన్ డాలర్ల సాయానికి ఐరాస పిలుపు

హరారే: జింబాబ్వే కరువు గుప్పెట్లో చిక్కుకుపోయింది. దీంతో అక్కడ ఆకలి కేకలు మిన్నంటాయి. పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే నిస్సహాయ పరిస్థితుల్లో తల్లిదండ్రులు కన్నీర్లు పెట్టుకుంటున్నారు. అయితే దేశంలో పరిస్థితి దారుణంగా ఉన్నదని, కరువు వారిని మింగేస్తోందని ఐరాస ఆవేదన వ్యక్తం చేసింది. కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తున్నట్లు తెలిపింది. తక్షణ సాయంగా 429.3 మిలియన్ డాలర్లు అవసరమని ప్రపంచ దేశాలకు ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. గతనెలలో జింబాబ్వే ప్రజల ప్రాణాలను కాపాడేందుకు 84.9 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని యూనిసెఫ్ కోరింది. మానవతా సంక్షోభం క్రమంలో నీటి ఎద్దడి, ఆహార కొరతతో పరిస్థితి దయనీయంగా మారినట్లు యూనిసెఫ్ అధికారులు తెలిపారు. 'కొన్ని నెలలుగా జింబాబ్వేలో కరువు తాండవిస్తోంది. పంటోత్పత్తి లేదు. కలరా వ్యాప్తితో అత్యవసర పరిస్థితి నెలకొంది. పోలియో కూడా దేశాన్ని పీడిస్తోంది' అని యూనిసెఫ్‌కు చెందిన నికోలాస్ వెల్లడించారు.

ఏక పార్టీ పాలనకు వ్యతిరేక తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

ఫాసిస్టు పాలనకు చరమగీతం పాడేలా ప్రజా తీర్పు వచ్చిందని తెలిపింది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణకు.... విద్వేష రాజకీయాలు, విపక్షకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని వెల్లడించింది. నిరుద్యోగం, మైనారిటీలపై మానవ హక్కులపై, ప్రజాస్వామ్యంపై దాడులను తిప్పికొట్టేలా ప్రజా తీర్పు ఉందని పేర్కొంది. ప్రజా సమస్యలను, కీలక అంశాలను పక్కకు పెట్టి మత విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలను చేసిన నరేంద్ర మోదీపై చర్యలు తీసుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో విఫలమైందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. ఇండియా ఐక్య సంఘటనలో సీపీఐ పాత్ర కీలకంగానే ఉంటుందని, ఉజ్వల భవిష్యత్ కోసం ప్రాథమిక హక్కుల పరిరక్షణకుగాను భారతీయులను మరింత చైతన్యపర్చేందుకు సీపీఐ క్రియాశీలంగా ఉంటుందని పేర్కొంది. తాజా ఫలితాలపై సీపీఐకు, లెఫ్ట్ పార్టీలకు ఆత్మవిమర్శ అవసరమని... పూర్తి నివేదికలు వచ్చాక ఫలితాలపై తమ పార్టీ నిశిత సమీక్ష నిర్వహిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం వెల్లడించింది.

ఎన్డీఏ పక్ష నేత మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం కృషి చేస్తూనే ఉండాలని తీర్మానించారు. దాదాపు 6 దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత దేశ ప్రజలు వరుసగా మూడోసారి సంపూర్ణ మెజారిటీతో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకున్నట్లు ఎన్డీఏ నేతలు పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీఏ ఐక్యంగా పోరాడి విజయం సాధించినట్లు తెలిపారు.

మోదీ రాజీనామా

ఎన్డీఏ సమావేశానికి ముందు ప్రధాని మోదీ తన రాజీనామాను రాష్ట్రపతికి ద్రౌపది ముర్ముకు సమర్పించగా... ఆమె వెంటనే ఆమోదించారు. మంత్రివర్గంతో కలిసి రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న మోదీ రాష్ట్రపతికి రాజీనామా సమర్పించారు. అలాగే, 17 వ లోక్‌సభను రద్దు చేయాలని రాష్ట్రపతి ముర్ముకు మోదీ సిఫార్సు చేశారు. రాష్ట్రపతి దీనిని అంగీకరించి, తాత్కాలిక ప్రధానమంత్రిగా కొనసాగాలని మోదీని కోరారు. మరోవైపు బుధవారం ఉదయం కేంద్ర కేబినెట్ చివరిసారిగా సమావేశమైంది. ప్రధాని మోదీ అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 17వ లోక్‌సభను రద్దు చేస్తూ తీర్మానం చేశారు. దాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపించారు. ముర్ము తీర్మానాన్ని ఆమోదిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశాక కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు వీలవుతుంది. అంతకుముందు లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మెజారిటీ సీట్లు సాధించిన నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై సమీక్షించేందుకు ప్రధాని అధ్యక్షతన దిల్లీలో కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. తదుపరి కార్యాచరణపై ఈ భేటీలో చర్చించినట్టు తెలుస్తోంది. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం జూన్ 16తో ముగుస్తుంది. 543 మంది సభ్యులున్న లోక్‌సభలో ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 240 సీట్లు సాధించగా ఎన్డీఏ పార్టీలతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని దక్కించుకుంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది. 2014లో 282 స్థానాలు, 2019లో 303 సీట్లతో సొంతంగానే బీజేపీ మెజార్టీ సాధించింది.

రాహుల్ కీలకం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ, ఈసారి 99 స్థానాలు దక్కించుకోవడం విశేషం. 2014లో 44, 2019లో 52 స్థానాలు మాత్రమే ఉన్న కాంగ్రెస్‌కు సుమారు వంద స్థానాలు రావడం వెనక రాహుల్‌గాంధీ పాత్ర కీలకం.

రెండు యాత్రల్లోనూ ప్రజాదరణ

2022, 2023లో రాహుల్‌గాంధీ రెండు యాత్రలు చేశారు. ఈ యాత్ర వల్ల కాంగ్రెస్ పునర్వైభవం వైపు సాగుతుందన్న నమ్మకం ప్రజలకు కలిగింది. రాహుల్ యాత్ర సాగే దారి పొడవునా లక్షలాది మంది ప్రజలు తమ సంఘీభావాన్ని తెలిపేందుకు తరలివచ్చారు. ఇది ఆ పార్టీ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని పెంచింది. పార్టీ-ప్రజల మధ్య అనుబంధాన్ని పునరుద్ధరించింది. రెండు జోడో యాత్రలు ఇండియా ఐక్య సంఘటనలోని పార్టీల మధ్య ఐక్యతను పటిష్టం చేశాయి. సమాజ్ వాదీ పార్టీతో కలిసి రాహుల్ చేసిన సోషల్ ఇంజినీరింగ్ కూడా ఉత్తర్‌ప్రదేశ్‌లో 'ఇండియా' మెరుగైన ఫలితాలను సాధించడానికి దోహదపడింది. అలాగే యాత్రల సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా కాంగ్రెస్ పుంజుకోవడానికి కారణమయ్యాయి. నిరుద్యోగంపై రాహుల్ సంధించిన ప్రశ్నలు కూడా ప్రజల్లోకి బలంగా దూసుకెళ్లాయి. రాయ్ బరేలీలో పోటీలో చేయాలని తీసుకున్న నిర్ణయం కూడా ఉత్తర్‌ప్రదేశ్‌లో 'ఇండియా' కు మంచి ఫలితాలు రావడానికి కారణమైంది. అలాగే మోదీ సర్కారు లక్ష్యంగా దేశవ్యాప్తంగా రాహుల్ దూకుడుగా ప్రచారం చేశారు. ఇదే కాంగ్రెస్ అవకాశాలను పెంచిందని ఏఐసీసీ యూపీ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ తౌకిర్ ఆలం అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని నిలకడగా ఎదుర్కొన్న ఏకైక ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనే కావడం విశేషం. 2019లో కాంగ్రెస్ పరాజయం తర్వాత రాహుల్ గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. 2022 అక్టోబర్‌లో మల్లికార్జున ఖర్గే అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నారు. కాగా రాహుల్ గాంధీ ప్రతిష్ఠను దిగజార్చేందుకు బీజేపీ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, అనేక కుయుక్తులు పన్నినా ఏమి సాధించలేకపోయారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

మళ్లీ సంకీర్ణ శకం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. తమిళనాడును చూసి కాంగ్రెస్ నేర్చుకోవాలని, తమిళనాడు ఫార్ములాను దేశమంతా అమలు చేసి ఉంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదని చెప్పారు. బీజేపీ వంటి ప్రమాదకర పార్టీని ఓడించాలంటే రాజకీయ ఐక్యత అవసరమని సూచించారు. అందుకోసం తాము ప్రయత్నిస్తే సీట్ల సర్దుబాటు అంశంలో తమకు ఓట్లు, సీట్లు లేవని చెప్పారని, ఏపీలో బీజేపీకి ఎంత బలముందని, ఎన్ని ఓట్లు ఉన్నాయని ఆరు ఎంపీ స్థానాలు, పది అసెంబ్లీ స్థానాలను చంద్రబాబు కేటాయించారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాల బలం పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో దేశంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పదని, భాగస్వామ్య పక్షాలు సంకీర్ణ ధర్మం పాటించాలని, అప్పుడే మరింత అభివృద్ధి సాధ్యమని నారాయణ అన్నారు. కూటమి రూపొందించుకున్న మార్గదర్శకాలకు అనుగుణంగా అంగీకృత విధానాలు అమలు చేస్తూ పరిపాలన సాగాలన్నారు. కమ్యూనిస్టుల వల్లనే కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉన్నదని, కమ్యూనిస్టుల చొరవతోనే గ్రామాలలో స్థిరమైన ఆర్థిక వ్యవస్థ ఉన్నదని నాటి కేంద్రమంత్రి చిదంబరం సాక్షాత్తూ పార్లమెంటులో చెప్పిన విషయాన్ని నారాయణ గుర్తు చేశారు. యూపీఏ-1లో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో అనేక ప్రజాప్రయోజన చట్టాలు వచ్చాయన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి పడ్డాయని నారాయణ అన్నారు. పార్టీ ఫిరాయింపులను వైఎస్ ప్రోత్సహిస్తే... చంద్రబాబు, ఆ తర్వాత జగన్ కొనసాగించారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా కొనసాగిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలకు కాంగ్రెస్ టికెట్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. అందుకే దానం నాగేందర్, రంజిత్‌రెడ్డిలను ప్రజలు ఓడించారన్నారు. కేసీఆర్ చేసిన తప్పులు కాంగ్రెస్ చేయరాదని, కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. రేవంత్ ప్రభుత్వం చిహ్నాల వివాదాలకు పోయి సమయం వృధా చేసుకోవద్దని నారాయణ హితవు పలికారు. భూ సమస్యలు, కాళేశ్వరం వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ వద్దు

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయాలని కొందరు కోరుతున్నారని, హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా చేయవద్దని, ఆ అవకాశమే ఇవ్వకూడదని నారాయణ అన్నారు. చంద్రబాబుకు హైదరాబాద్‌పై ఆశ ఉన్నదని, రాజధాని ఏపీలోనే ఉండాలన్నారు. జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలను గతంలో ఎవరూ ఇవ్వలేదని, జగన్ సంక్షేమాలపైనే ఆధారపడి...రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఉన్న పరిశ్రమలను విక్రయిస్తూ జగన్ నియంతృత్వ పాలన కొనసాగించారని దుయ్యబట్టారు. ఏపీలో టీడీపీ విజయాలే కనిపిస్తున్నాయని, బీజేపీ విజయాలు కనిపించడంలేదన్నారు. బీజేపీకి కేటాయించిన కొన్ని స్థానాల్లో వైసీపీ గెలిచిందన్నారు. అగ్గికి ఆజ్యం మాదిరిగా చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తోడయ్యారని తెలిపారు. ఏపీ ఫలితాలు చంద్రబాబు, జగన్, మీడియా, తమకు సైతం అంతుపట్టలేదన్నారు. జగన్ ఐదేళ్ల దుష్టపాలన కారణంగానే చంద్రబాబు గెలిచారన్నారు.

విభజన హామీలు అమలు చేయకుండా మోదీ సర్కారు పదేళ్లుగా తొక్కిపెట్టిందని నారాయణ విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, అమరావతి రాజధానికి నిధులు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాలకు ఆక్సిజన్ వంటిదని చెప్పారు. ఏపీ డిమాండ్లు సాధించుకునేందుకు నిర్దిష్టమైన ప్రయత్నం చేయాలని చంద్రబాబుకు సూచించారు. ఈ డిమాండ్లు నెరవేరిస్తే బీజేపీతో ఉండొచ్చని, లేకపోతే ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. ఇండియా ఐక్య సంఘటనకు మద్దతిస్తే అన్ని హామీలు అమలవుతాయన్నారు. కేవలం సంక్షేమ పథకాల ద్వారానే అధికారంలోకి వస్తామనుకోవడం కలేనన్నారు. ఐదేళ్లు సంక్షేమాన్ని అమలు చేసిన జగన్ ఎన్నికల సమయంలో ఓట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

జగన్ పాలన ఓ కేస్ స్టడీ: రామకృష్ణ

రాష్ట్రాన్ని ఏ విధంగా పరిపాలించకూడదో చెప్పడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ పాలన ఒక కేస్ స్టడీగా పనికొస్తుందని కె.రామకృష్ణ అన్నారు. మోదీ ప్రభుత్వం ఏపీకి తీరని అన్యాయం చేసిందని, రాష్ట్రంతో అత్యంత దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. ఏపీకి జరిగిన అన్యాయాన్ని ముగిసిన అధ్యాయమని ప్రధాని వ్యాఖ్యానించడం గర్హనీయమన్నారు. చంద్రబాబుకు సువర్ణ అవకాశం వచ్చిందని, ఆ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాలని, అలా చేస్తేనే ప్రజలు హర్షిస్తారన్నారు. జగన్‌ను సీఎంగా కొనసాగించాలా...వద్దా అనే అంశంపైనే ఎన్నికలు జరిగాయన్నారు. పెన్షన్లు, సంక్షేమ పథకాలు ఇచ్చినా ప్రజలు అన్యాయం చేశారని జగన్ అంటున్నారని, జగన్ ఏనాడూ ప్రజాస్వామ్యాన్ని గౌరవించలేదని, ప్రజా సమస్యలపై ఒక్కసారైనా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయలేదని, ప్రతిపక్షాలను పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యలు విన్నవిద్దామంటే జగన్ సచివాలయానికే రాలేదన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక విధానాలు, నియంత పోకడ, ప్రజావ్యతిరేక పాలనే జగన్ ఓటమికి కారణమని రామకృష్ణ చెప్పారు.

జగన్ పాలన ఒక నమూనా

(మొదటిపేజీ తరువాయి)

లాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని, అన్నిరంగాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ జగన్ నిర్వీర్యం చేశారన్నారు. నేను ఇప్పటికి 10 ఎన్నికలు చూశాను. కానీ ఇంతటి చారిత్రాత్మక ఎన్నికలు నా జీవితంలో చూడలేదన్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కడో విదేశాల్లో ఉండే వ్యక్తులు లక్షలు ఖర్చు పెట్టుకని వచ్చి మరీ ఓటు వేశారు. పక్క రాష్ట్రాలకు పొట్టకూటి కోసం వెళ్లిన వారు కూడా సొంత డబ్బులు పెట్టుకుని వచ్చి ఓట్లు వేశారు. ప్రజల నిబద్ధతను ఎలా అభినందించాలో, ఎలా వర్ణించాలో అర్థం కావడం లేదు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల కంటే టీడీపీకి ఈ విజయం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. టీడీపీ స్థాపించినప్పుడు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో 200 సీట్లు వచ్చాయి. 1994లో ప్రతిపక్షానికి కొన్ని చోట్ల డిపాజిట్ రాలేదు. వాటన్నింటినీ కూడా ఇప్పుడు అధిగమించి ఈ ఎన్నికల్లో కూటమికి 55.38 శాతం ఓట్లు వచ్చాయి. ఇందులో టీడీపీకి 45.60 శాతం, వైసీపీకి 39.37 శాతం ఓట్లు వచ్చాయి. ఎప్పుడూ లేనంతగా కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీలు వచ్చాయన్నారు. అహంకారం, నియంతృత్వం, విచ్చలవిడితనాన్ని ప్రజలు క్షమించరన్నదానికి ఈ ఫలితాలే నిదర్శనం. ప్రజలు చెప్పిన గుణపాఠం పాలకులకు కాదు... అవినీతి, అహంకారంతో ముందుకు వెళ్లే విధ్వంసకారులకు ఇదే జరుగుతుంది. గత ఐదేళ్లుగా మా కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కంటినిండా నిద్రలేని రాత్రులు గడిపారు. కొందరు ప్రాణాలు కూడా త్యాగం చేశారు. ఆ త్యాగాల ఫలితమే ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలిగాం. మీడియా ఐదేళ్లు పడిన ఇబ్బందులు, కోర్టుల చుట్టూ తిప్పిన ఇబ్బందులు, సీఐడీ ఆఫీసులు చుట్టూ తిప్పిన ఘటనలు చూసుకుంటే సిగ్గుతో తలదించుకోవాల్సిన దుస్థితి. పవన్ కల్యాణ్‌ను కూడా స్వేచ్ఛగా ఉండనివ్వలేదు. విశాఖ పర్యటనకు వెళితే నగర బహిష్కరణ చేయాలని చెప్పారు. కేసులు పెడితే ఎందుకు కేసు పెట్టావని అడిగితే సమాధానం చెప్పకుండా అరెస్టు చేసి తర్వాత వివరాలు చెప్తామని చెప్పారు. ఐదేళ్ల జగన్ పాలనలో 30 ఏళ్ల విధ్వంసం జరిగింది. అప్పులు ఎంత చేశారో తెలీదు. సహజ సంపదలైన ఇసుక, మైన్, గనులు అన్నింటినీ ఇష్టానుసారంగా దోచేశారు. ఈ ప్రభుత్వంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. విద్యుత్ రంగంపై అప్పులు తెచ్చి వాటినీ దుర్వినియోగం చేశారు. విద్యుత్ శాఖను సంక్షోభంలోకి నెట్టారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు మాకు ఇచ్చింది అధికారం అని అనుకోవడం లేదు. బాధ్యతగా తీసుకుంటున్నాం. పాలకులం కాదు... సేవకులం అనే భావనతో పని చేస్తాం. సూపర్-6, ప్రజాగళం మేనిఫెస్టో ప్రజల్లోకి బాగా వెళ్లాయి. నా మాటను, గౌరవాన్ని నిలబెట్టిన ప్రజల రుణం తీర్చుకుని ప్రజల ఆశల మేరకు పని చేస్తాం. ఓట్లు వేసిన ప్రజలు కూడా రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెట్టేందుకు ప్రభుత్వానికి ఎల్లవేళలా సహకరించాలని కోరారు. ఒక ప్రశ్నకు సమాధానంగా మేము ఎన్డీయేతోనే ఉన్నాం, ఉంటామని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఫైళ్లు మాయం!

(మొదటిపేజీ తరువాయి)

ఫైళ్లను ముక్కలు ముక్కలుగా చింపేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ-ఆఫీస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులను సైతం పోలీసు అధికారులు ప్రశ్నిస్తున్నారు.ఐటీ కమ్యూనికేషన్ విభాగంలో ఉద్యోగుల కంప్యూటర్‌లు, ల్యాప్ ట్యాప్‌లు, ఇతర ఉపకరణాలను తనిఖీ చేశారు. అలాగే ఐటీ విభాగంలోని కంప్యూటర్‌ల నుంచి డేటా తస్కరణకు, డిలీట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో అధికారుల తనిఖీలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యోగుల నుంచి పెన్‌డ్రైవ్‌లు, డేటా హార్డ్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. సర్వర్‌లలో డేటా డిలీట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపణలు రావడంతో పోలీసులు తనిఖీలు చేసినట్లు ఐటీశాఖ ఉన్నతాధికారులు చెపుతున్నారు. మరోవైపు రెవెన్యూ శాఖలో ముఖ్యమైన దస్త్రాల ప్రక్రియ నిలిపివేయాలని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆదేశాలు జారీ చేశారు. మంత్రి పేషీలోని రికార్డులు, దస్త్రాలను జాగ్రత్తపరచాలని సిబ్బందికి సూచించారు. గుత్తేదారులకు నిధుల విడుదల, భూ కేటాయింపు దస్త్రాలు నిలిపివేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. బదిలీలు, సెలవులపై కూడా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. అలాగే త్వరలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో సచివాలయంలోని మంత్రుల ఛాంబర్లను సాధారణ పరిపాలనశాఖ స్వాధీనం చేసుకుంటోంది. మంత్రులు, సలహాదారుల పేషీల నుంచి నేమ్ బోర్డులను జీఏడీ సిబ్బంది తొలగించారు. మంత్రుల పేషీల్లోని ఫర్నీచర్, కంప్యూటర్‌ల వివరాలను నమోదు చేసుకుని జీఏడీ అధికారులు లెక్కలు సరిపోల్చుకుంటున్నారు. వ్యక్తిగత సామాగ్రి సచివాలయం నుంచి బయటకు తీసుకెళ్లాలంటే తప్పనిసరిగా వాటికి సంబంధించిన బిల్లులు చూపించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సరైన సమయంలో నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

పరిణామాలపై చర్చించింది. ఐక్యంగా ముందుకెళ్లాలని నిర్ణయించింది. ఖర్గే మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మోదీకి, బీజేపీకి ప్రజలు గుణపాఠం నేర్పారన్నారు. మోదీ నైతికంగా ఓడిపోయారని చెప్పారు. ఎన్నికల ఫలితాలు మోదీకి, మోదీ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా వెలువడ్డాయన్నారు. రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగానూ మోదీకి ఇది ఘోర పరాభవమని ఖర్గే వ్యాఖ్యానించారు. భావసారూప్యతగల అన్ని పార్టీలను ఇండియా ఐక్య సంఘటన స్వాగతిస్తున్నదని తెలిపారు. రాజ్యాంగంపై విశ్వాసం, దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం వంటి లక్ష్యాలకు కట్టుబడి ఉన్న పార్టీలన్నింటినీ స్వాగతిస్తున్నామని చెప్పారు. 'ఇండియా' భాగస్వామ్య పక్షాలన్నీ సమన్వయంతో బాగా పోరాడాయని ప్రశంసించారు. మెరుగైన ఫలితాలు సాధించాయని అభినందించారు. తొలుత ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములు అందరికీ స్వాగతం పలికిన ఖర్గే... తామంతా ఐక్యంగా పోరాడి మెరుగైన ఫలితాలు సాధించగలిగామన్నారు. నాయకుల భేటీ అనంతరం ఖర్గే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మోదీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఇండియా ఐక్య సంఘటనకు లభించిన అమితాదరణకు ప్రతి ఒక్క నాయకుడి తరపున దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓటు ద్వారా బీజేపీ విద్వేష రాజకీయాలకు, అవినీతికి ప్రజలు దీటైన బదులిచ్చారన్నారు.

ప్రజా తీర్పు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి సమర్థన... అధిక ధరలు, నిరుద్యోగం, ఆశ్రిత పెట్టుబడిదారులకు వ్యతిరేకమని చెప్పారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు 'ఇండియా' కట్టుబడి ఉందని ఖర్గే తెలిపారు. సమావేశంలో ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేశ్, శరద్ పవార్ (ఎన్‌సీపీ-ఎస్పీ), ఎంకే స్టాలిన్ (డీఎంకే), డి.రాజా (సీపీఐ), సీతారాం ఏచూరి (సీపీఎం), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్), సంజయ్ రౌత్ (శివసేన-యూబీటీ), సంజయ్ సింగ్ (ఆప్), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), అభిషేక్ బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), చంపై సోరెన్ (జేఎంఎం), రాఘవ్ చడ్డా (ఆప్), సుప్రియా సూలే (ఎన్‌సీపీ-ఎస్పీ), కల్పనా సోరెన్ (జేఎంఎం) తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవులు ఎవరికి?

(మొదటిపేజీ తరువాయి)

సమతుల్యత పాటిస్తే ఎవరెవరికి మంత్రి పదవులు లభించే అవకాశాలు దక్కనున్నాయనే దానిపై విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. అలాగే జనసేన, బీజేపీ కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యులైతే వారిలో మంత్రి పదవులు ఎవరిని వరించే అవకాశాలున్నాయో ఎమ్మెల్యేలు చర్చించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాల్గవసారి ప్రమాణ స్వీకారం చేసేందుకు ఓపక్క ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన ఈనెల 11 లేదా 12న ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. ఈనెల 9న నరేంద్రమోదీ ప్రధానిగా ప్రమాణం చేయనున్న నేపథ్యంలో ఆ తర్వాతే చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు సమాచారం. చంద్రబాబు కూడా తొలుత ఈనెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించినప్పటికీ... ఈనెల 7న మరోసారి ఎన్డీయే సమావేశం జరగనుంది. ఈ భేటీకి కూటమిలోని అన్ని పార్టీల అధినేతలు, ఎంపీలంతా హాజరుకానున్నారు. ఆరోజే రాష్ట్రపతిని కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరనున్నారు. ఆ తర్వాత నరేంద్ర మోదీ 9వ తేదీ ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించుకున్నందున చంద్రబాబు తన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని 12వ తేదీకి వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. అదేరోజు కొందరు ముఖ్యనేతలు చంద్రబాబుతో పాటు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా టీడీపీలో సీనియర్‌నేతగా, ఆర్థికవేత్తగా పరిణతి చెందిన ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడికి మరలా ఆర్థిక మంత్రి పదవి ఖాయమంటున్నారు. ఇక పార్టీలో సీనియర్‌లుగా ఉన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, మాజీ అధ్యక్షులు కళా వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అయ్యన్నపాత్రుడు, దూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, పొంగూరు నారాయణ, ఆనం రాంనారాయణ రెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గంటా శ్రీనివాసరావు, కూన రవికుమార్, బండారు సత్యనారాయణమూర్తి, చిన రాజప్ప, జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, నారా లోకేశ్, కాల్వ శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్, మహిళా కోటాలో పరిటాల సునీత, వంగలపూడి అనిత, భూమా అఖిలప్రియ, ముస్లిం కోటాలో ఎన్ఎండీ ఫరూక్ తదితరుల పేర్లు మంత్రివర్గ రేసులో వినపడుతున్నాయి.

పవన్ కల్యాణ్‌కు కీలక పదవి

జనసేన పార్టీ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షంగా చేరితో పవన్ కల్యాణ్‌కు కీలక పదవి లభిస్తుందని కూటమి పార్టీల్లో చర్చ జరుగుతోంది. ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఖాయమని, లేనిపక్షంలో హోంశాఖ ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకవేళ పవన్ కల్యాణ్ సినిమాల్లో కూడా కీలకంగా ఉండాలని భావిస్తే డిప్యూటీ సీఎం పదవి తీసుకుని అంతగా ప్రాముఖ్యత లేని శాఖ తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక పవన్‌తో పాటు జనసేన నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైన నాదెండ్ల మనోహర్‌కు స్పీకర్ పదవి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ఆయన గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కూడా స్పీకర్ పదవీ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు. అలాగే ఆయన ఒకవేళ స్పీకర్ పదవి వద్దనుకున్న పక్షంలో మండలి బుద్ధప్రసాద్ పేరు పరిశీలించవచ్చునని భావిస్తున్నారు. అలాగే బీజేపీలో సుజనా చౌదరి, విష్ణుకుమార్ రాజు, కామినేని శ్రీనివాస్, సత్యకుమార్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డిల్లో ఒకరు లేక ఇద్దరికి మంత్రివర్గంలో స్థానం లభించే పరిస్థితులున్నాయని ఆపార్టీ నేతలు పేర్కొంటున్నారు.

కేంద్ర మంత్రివర్గంలోనూ ఆశలు

ఎన్డీఏలో చంద్రబాబు కీలకం కానుండడంతో టీడీపీ ఎంపీ అభ్యర్థుల్లో కూడా ఆశలు రేకెత్తుతున్నాయి. గతంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామ్యపక్షంగా ఉన్నప్పుడు నాడు టీడీపీ ఎంపీలుగా ఉన్న సుజనా చౌదరి, అశోక్‌గజపతిరాజులకు అవకాశం లభించింది. మరలా ఇప్పుడు కూడా ఆ పరిస్థితి పునరావృతమైతే టీడీపీ ఎంపీల్లో ఎవరికి అవకాశం లభిస్తుందోనన్న చర్చ కూడా కూటమి నేతల్లో జరుగుతోంది. వరుసగా మూడోసారి ఎంపీగా ఎన్నికైన కింజారపు రామ్మోహన్‌నాయుడికి కచ్చితంగా కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఆయన తర్వాత మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలలో ఒకరికి అవకాశం లభించవచ్చునన్న చర్చ జరుగుతోంది.

'కొరియా' సైనిక ఒప్పందం రద్దు: యూన్

సియోల్: ఉత్తర కొరియాతో 2018లో చేసుకున్నత అంతర్గత సైనిక ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేస్తున్నట్లు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యెల్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య ఘర్షణ-ఉద్రిక్తత పరిస్థితులను నియంత్రించేందుకుగాను ఈ ఒప్పందం జరిగింది. అయితే ఉత్తర కొరియా కొద్ది రోజులుగా చెత్త నింపిన సంచులను పెద్ద బూరలకు కట్టి దక్షిణ కొరియాలోకి పంపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా తమ రెండు దేశాల మధ్య జరిగిన సైనిక ఒప్పందాన్ని రద్దు చేయాలని నిర్ణయించుకుంది.

మోదీకి 50 దేశాధినేతల శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: ఎన్డీయే వరుసగా మూడవసారి గెలవడంతో 50 దేశాధినేతల నుంచి శుభాకాంక్షలను నరేంద్ర మోదీ అందుకున్నారు. చారిత్రక విజయాన్ని నమోదు చేసి మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్న మోదీకి ఆసియా, యూరప్, ఆఫ్రికా, కరేబియన్ దేశాల నుంచి అభినందనలు వెల్లువిరిసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జపాన్, ఇటలీ, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మారిషస్, సింగపూర్, మలేసియా దేశాల ప్రధానులు; స్పెయిన్, దక్షిణ కొరియా, శ్రీలంక, ఇరాన్, నైజీరియా, కెన్యా, కమోరోస్ దేశాధ్యక్షులు వేర్వేరుగా మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

జమైకా, బార్బోదస్, గునియా అధినేతలు కూడా శుభాకాంక్షలు తెలుపుతూ లేఖలు పంపారు.

జగన్ పాలన మెచ్చని ప్రజలు

మూడు రాజధానులను పట్టించుకోని ఓటర్లు

మెజారిటీలపై విజేతల అవాక్కు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఏపీలో ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయని ఏ రాజకీయ పార్టీ ఊహించలేదు. అధికారం దక్కుతుందని ఆశించిన కూటమి నేతలు కూడా ఇంత భారీ మెజారిటీ దక్కుతుందని అనుకోలేదు. ఇంత దారుణ ఓటమి చవిచూడాల్సి వస్తుందని ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ గ్రహించలేకపోయింది. పదవి చేపట్టినప్పటి నుండి కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు నోటి దురుసు ప్రదర్శించారు. టీడీపీ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు 95,235 ఓట్ల మెజారిటీ లభించింది. విశాఖ జిల్లా పార్లమెంటుకు పోటీ చేసిన టీడీపీ కూటమి అభ్యర్థి శ్రీ భరత్‌కు 5,04,247 మెజార్టీ వచ్చింది. ఇది దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికంగా కనిపిస్తోంది. జగన్ ప్రభుత్వంలో రెండు విడతలుగా 41 మంది మంత్రులుగా పని చేయగా, వారిలో నేరుగా పోటీ చేసిన 35 మందితో పాటు తమ స్థానంలో వారసులను బరిలోకి దింపిన ముగ్గురు మంత్రులకు కూడా ఓటమి తప్పలేదు. గతంలో ఉన్నదూ చూడని విధంగా మెజారిటీలు రావడంతో గెలిచిన అభ్యర్థులే అవాక్కయ్యారు. ముగ్గురు కలిసి మూడు రెక్కలు విరిచేయడం కాదు...ప్రజల వ్యతిరేక సునామీకి ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయని రాజకీయ విశ్లేషకులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలని, ప్రజల్ని హింసించి మోసగిస్తే తగిన సమయంలో గుణపాఠం తప్పదని ఈ ఫలితాలు రుజువుచేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. రాజ్యాంగం ప్రజలకిచ్చిన ఆయుధం ఓటు హక్కు అని, పాలకులు ఈ విషయం గుర్తుంచుకోవాలని అంటున్నారు. గద్దె నెక్కించాలన్నా...దించేయాలన్న ఓటర్లకే సాధ్యమన్న నగ్నసత్యం రాజకీయ నేతలకు అర్థం కాకపోవడం విషాదకరం. బళ్లు ఓడలవుతాయి...ఓడలు బళ్లవుతాయన్న నగ్నసత్యాన్ని వైసీపీ నేతలు గ్రహించలేకపోయారు. ఉచితాలకే ఓట్లు రాలవని ప్రజలు భావిస్తున్నారు. ఓ వైపు సంక్షేమం పేరుతో ఉచితాలు ఇవ్వడం...మరో చేత్తో పన్నుల రూపంలో ప్రజల రక్తం తాగడాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని, అందుకే వైసీపీ ప్రభుత్వానికి ఈ గతి పట్టిందని విశ్లేషకులు అంటున్నారు. మతోన్మాదం రెచ్చగొట్టి, అణచివేత, విధ్వంసకర, వినాశకర, నిరంకుశ పాలన సాగించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి జగన్ సహా పాలకులందరికీ ఈ తీర్పు చెంపపెట్టు అని అంటున్నారు. విధ్వంసంతో ప్రారంభమైన వైసీపీ పాలనకు, రిషికొండను బోడిగుండు చేసిన జగన్ సర్కార్‌కు తీర్పు ఎలా ఉంటుందో ప్రజలు రుచి చూపించారు. బటన్ నొక్కడం ఒక్కటే పాలన కాదని, ప్రజలతో మమేకం కావడం, అభివృద్ధి చూపడం, భవిష్యత్ తరాలకు బాసటగా నిలవడం అత్యవసరమని చెబుతున్నారు. ఇసుక దోపిడీ, గనుల దోపిడీ, అధిక ధరలు, నిరుద్యోగం అధికమై 151 స్థానాల నుండి 11 స్థానాలకు వైసీపీని పడేశారు. ఓ రాష్ట్రానికి రాజధాని ఏదో తెలియకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. ఇది వినడానికే విడ్డూరంగా ఉంది. కానీ ఇదే జరిగింది. ఏపీకి ఇది జగన్ చేసిన మోసం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'అమరావతికి సై' అన్న జగన్... పీఠమెక్కాక మూడు రాజధానులు అంటూ కొత్తపల్లవి అందుకున్నారు. 'పరిపాలన వికేంద్రీకరణ', 'అభివృద్ధి' అంటూ మాయమాటలు చెప్పారు. మాటల కోటలే కానీ అభివృద్ధి దిశగా అడుగు వేసింది లేదు. దాంతో ప్రజా రాజధాని అమరావతిని ఎవరూ పట్టించుకోక పోవడంతో అనాథగా మారింది. పాలనా రాజధానిగా విశాఖను పిలిచి అక్కడ భూముల పందేరంతో కోట్లు కొల్లగొట్టారు. ప్రశాంత విశాఖ చుట్టుపక్కల చాలా భూములు వైసీపీ నాయకుల చేతుల్లో ఉన్నాయన్నది కాదనలేని వాస్తవం. అమరావతినీ, ఉత్తరాంధ్రనీ తిరోగమనం దిశగా మళ్లించిన జగన్... న్యాయ రాజధాని అంటూ కర్నూలు జనాలనూ మభ్యపెట్టారు. ఈ మూడు ముక్కలాటలో ప్రజలు తాత్కాలికంగా వెనకడుగు వేసి ఉండొచ్చు. కానీ ఓటేసే సమయం రాగానే ప్రభుత్వంపై వేటు వేశారు.

చల్లబడ్డ వాతావరణం

నేడు, రేపు వర్షాలు

విశాలాంధ్రనెట్‌వర్క్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఎండ వేడిమినుంచి ఉపశమనం పొందారు. ఉమ్మడి పశ్చిమగోదావరితో పాటు వివిధ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. అనేక ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. కాగా గురు, శుక్రవారాల్లో విజయనగరం, మన్యం,అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. అలాగే రాబోయే రెండు రోజుల్లో అనేక జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమలో మూడురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించింది. కాగా బుధవారం సాయంత్రం 5 గంటల నాటికి కాకినాడ జిల్లా శంఖవరంలో 47.5మి.మీ, పెద్దాపురంలో 46.2మి.మీ, తిరుపతి జిల్లా దొరవారిసత్రంలో 44.5మి.మీ, మన్యం జిల్లా పాలకొండలో 39.5మి.మీ, విజయనగరం జిల్లా సంతకవిటిలో 39మి.మీ, రాజాంలో 37.7మి.మీ, వేపాడలో 35.7మి.మీ, తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడిలో 33.5మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

రుతుపవనాల విస్తరణ

రాబోయే మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణ, కోస్తాంధ్రలోని ఇతర ప్రాంతాలలో విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతావరణ అధికారులు వివరించారు. నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం బుధవారం ఉదయం దక్షిణ ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 3.1 నుంచి 4.5కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

తెలుగు విద్యార్థి హర్షిత్‌కు

అమెరికా ప్రెసిడెన్షియల్ అవార్డు

విశాలాంధ్ర-మచిలీపట్నం: తెలుగు తేజం హర్షిత్‌కు ప్రతిష్టాత్మకమైన అమెరికా ప్రెసిడెంట్ అవార్డు లభించింది. రవితేజ, శ్రీదీప్తిల కుమారుడైన హర్షిత్ డల్లాస్ నగరంలోని మిలీషియా ప్రాంతంలోని విల్లో వుడ్ ఎలిమెంటరీ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. ఇంగ్లీష్, సైన్స్, సోషల్, మాథ్స్, ఆటపాటలు, క్రమశిక్షణ, తోటి విద్యార్థులతో కలిసిమెలిసి ఉండటం, ఉపాధ్యాయులు చెప్పినట్టు వినడం తదితర అన్ని అంశాలతో పాటు పాఠశాలలో పని చేసే అందరి సూచనలతో ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. ఈ అవార్డు అమెరికా అధ్యక్షులు సంతకం చేసి సీలు వేసి పంపుతారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు కుమార్తె అయిన శ్రీదీప్తి కుమారుడు హర్షిత్‌కు అవార్డు రావడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, అనేక మంది ప్రముఖులు హర్షిత్‌కు అభినందనలు తెలియజేశారు.

ఎన్డీఏకు చంద్రబాబు మద్దతు వద్దు

'ఇండియా' పక్షాన నిలవాలి

మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా దగాచేసి, అమరావతి రాజధానికి తగిన నిధులు ఇవ్వకుండా, పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, పునరావాస ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం పైన మోపిన మోదీకి టీడీపీ అధినేత చంద్రబాబు మద్దతివ్వడం సరికాదని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్నికల ప్రణాళికలో స్పష్టమైన గ్యారంటీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతో కూడిన ఇండియా ఐక్య సంఘటనకు టీడీపీ మద్దతు ఇవ్వాలని దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులు కోరుతున్నారని సూచించారు. ఐదేళ్లుగా సీఎం జగన్ ప్రభుత్వం కొనసాగించిన అత్యంత అవినీతికర, అరాచక, అప్రజాస్వామిక దుష్ట పరిపాలనకు చరమగీతం పాడినందుకు ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన చంద్రబాబును అభినందించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి మోదీ పరోక్షంగా మద్దతు ఇవ్వడంతోనే జగన్ అనేక వేల కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులను చిన్న లోపాలకే జైళ్లలో పెట్టిన మోదీ... జగన్‌కు ఇష్టమొచ్చినట్లు రాష్ట్రాన్ని దోచుకునేందుకు అనుమతి చ్చాడని తెలిపారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలతో రైతులకు, విద్యుత్ బిల్లు 2020తో ట్రూ అప్ చార్జీలు, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, నీతి ఆయోగ్ ద్వారా ల్యాండ్ టైటిల్స్ చట్టం, పెద్దనోట్ల రద్దు, సామాన్యులపైనా జీఎస్టీ విధింపు తదితర చర్యలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, పౌర, పత్రికల స్వేచ్ఛకు భంగం కలిగించారన్నారు. ప్రజల సంపదైన ప్రభుత్వ రంగసంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీకి అమ్మివేస్తున్న నరేంద్ర మోదీకి కాకుండా, 'ఇండియా'కు చంద్రబాబు మద్దతు ఇవ్వాలని వడ్డే విజ్ఞప్తి చేశారు.

ప్రకృతిని రక్షిద్దాం: శ్రీధర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రకృతిని రక్షిద్దామని, భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామని ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) సభ్య కార్యదర్శి బి.శ్రీధర్ పిలుపునిచ్చారు. విజయవాడ ఎన్ఏసీ కళ్యాణ మండపంలో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2024 నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ మానవ మనుగడ సజావుగా సాగాలంటే ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన లేకపోతే భావితరాల భవిష్యత్‌ను చేజేతులా మనమే నాశనం చేసిన వాళ్లమవుతామని హెచ్చరించారు. ప్రధానంగా మట్టి, నీరు, గాలి కలుషితం కాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకునేలా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. 1972 నుంచి జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ఇది 52వ పర్యావరణ దినోత్సవమని తెలిపారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధ్వర్యంలో పర్యావరణ రక్షణ కోసం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేస్ట్ నుంచి ఎనర్జీ దిశగా అడుగులు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రతి ఒక్కరూ తమ వంతుగా నిషేధం పాటించాలని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ సంచిని తీసుకువెళ్లాలని సూచించారు. పెద్ద పరిశ్రమల నుంచి వెలువడే కార్బన్ డై ఆక్సైడ్ మాత్రమే కాలుష్యం అనుకుంటున్నామని, ఆహార వృథా సైతం పరోక్షంగా పర్యావరణ కాలుష్యానికి కారణమవుతోందన్నారు. భావితరాల భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని... పర్యావరణ పరిరక్షణకు ఇప్పటి నుంచే నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ (కాకినాడ) అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ మానవుడి ప్రథమ కర్తవ్యం ప్రకృతిని కాపాడటమేనని అన్నారు. పర్యావరణంపై ప్రేమను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రధాన ఇంజనీర్ ఎస్.వి.భాస్కర రావు, పర్యావరణ పరిరక్షణ సంస్థ అధ్యక్షులు ఎ.వి.రత్నం, ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.మునిస్వామి నాయుడు, ప్రాంతీయ కార్యాలయ అధికారి పి.శ్రీనివాసరావు, ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో తమకిచ్చిన ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కొత్త ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, మనకు ప్రత్యేక హోదా రావాలని, పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. రాజధాని నిర్మాణం జరగాలని, నిరుద్యోగులకు పెద్దఎత్తున ఉద్యోగాలు ఇవ్వాలని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా సాగాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచన చేసి, ప్రత్యేక హోదా కోసం కట్టుబడాలని, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, జనం గొంతుకగా కాంగ్రెస్ పార్టీ మారిందన్నారు. ఇక మీద కూడా రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యాలను ఎండగడుతుందని పేర్కొన్నారు.

ఎన్డీఏ విజయంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ఘన విజయంపై ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, నాల్గోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) చారిత్రాత్మక విజయం సాధించడంపై అభినందనలు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నడూ లేనంతగా 5లక్షల 30వేల ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనాకు ధన్యవాదాలు తెలిపారు.

ఏపీటీఎఫ్ అభినందనలు: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్ సహా కూటమి నేతలకు అభినందనలు తెలిపారు. ఉద్యో గులు అత్యధిక సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం ప్రభుత్వ మార్పునకు నాందిగా నిలిచిందన్నారు.

జంబో డీఎస్సీపై పవన్ హామీ

ఏపీ నిరుద్యోగ జేఏసీ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జంబో డీఎస్సీ ప్రకటన విడుదలకు చర్యలు తీసుకుంటానని జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ ప్రకటంచడం పట్ల ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంతకుమార్ హర్షం వ్యక్తం చేశారు. జులై 28న నిర్వహించాల్సిన గ్రూప్-2 ప్రధాన పరీక్షను మరో రెండు నెలలు వాయిదా వేయాలని కోరారు. ఇప్పటివరకు అభ్యర్థులు ఎన్నికల విధుల్లో కొందరు, ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులతో కొందరు నిమగ్నమై ఉండటం వల్ల చదువుకోవడానికి మరికొంత సమయం కావాలని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం, కొత్త బడ్జెట్ ఏర్పాటు చేసినప్పుడు కరెంట్ అఫైర్స్‌లో ప్రశ్నలు కూడా మారుతాయని, దీంతో ఇవన్నీ పూర్తయిన తర్వాత గ్రూప్-2 పరీక్ష పెట్టాలని డిమాండ్ చేశారు. అదే తరహాగా గ్రూప్-1, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈవో) పోస్టులకు 1:00 ఎంపిక విధానాన్ని అమలు చేయాలని, 2023లో పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష రాసిన అభ్యర్థులకు లోపం ఉన్న ప్రశ్నలకు గ్రేస్ మార్కులు వేసి ఆదుకోవాలన్నారు. గ్రంథాలయ శాఖ ఉద్యోగాలు భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాలలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు త్వరలో ప్రకటన జారీచేయాలని, ఇప్పటివరకు జరిగిన ఆలస్యాన్ని గుర్తించి ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ ఉద్యోగ వయోపరిమితి 47 సంవత్సరాలకు జనరల్ అభ్యర్థులకు పెంచి ప్రకటన ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ యువతకు చట్ట సభలలో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ఓటమి సాకులు

- ఈవీఎం ట్యాంపరింగ్ అనుమానాలు!
- ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీపై సందేహాలు
- ల్యాండ్ టైటిలింగ్‌పై దుష్ప్రచారం
- మాజీ మంత్రి కారుమూరి, రవీంద్రనాథ్ రెడ్డి ఆరోపణ
- ధనుంజయ రెడ్డి ఏకపక్ష పోకడతోనే నష్టం : జక్కంపూడి రాజా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీ ఓటమిపై అనేక కారణాలను వెతుకుతున్నది. ఈ ఘోర పరాజయంపై పార్టీ నేతలు, అభ్యర్థులు ఆత్మపరిశీలన చేసుకుంటున్నారు. అందులో ఒకటిగా ఈవీఎంల ట్యాంపరింగ్ అంశాన్ని ఆ పార్టీ నేతలు వరుసగా తెరపైకి తెస్తున్నారు. ఎన్డీఏ కూటమి పార్టీలకు ఊహించని రీతిలో భారీ గెలుపు, మెజార్టీలపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై దుష్ప్రచారాన్ని ఒక కారణంగా చూపుతున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు మీడియా ముందుకు వచ్చారు. ఈ ఎన్నికల్లో వ్యవస్థలను మేనేజ్‌చేసి, భారీగా ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసినట్లుగా తమకు అనుమానాలున్నాయని, త్వరలో వాటి సమాచారం తెలిసే అవకాశం ఉందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్ రెడ్డి, జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు భారీ మెజార్టీలతో గెలవడంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల ఆధారంగా... ప్రధానంగా చిత్తూరు జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు వచ్చిన మెజార్టీలు భారీగా ఉన్నాయని చెబుతున్నారు. ప్రతి రౌండ్‌లోనూ దాదాపు 20 వేల నుంచి 90 వేలకు మెజార్టీలు ఏకపక్షంగా పెరిగిపోవడంపై ఆ పార్టీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వైసీపీకి ప్రధాన ఓటు బ్యాంకింగ్‌గా నిలిచిన ప్రాంతాలు, నియోజకవర్గాల్లో మెజార్టీలు భారీగా పెరిగిపోయాయని, ఇవి ఎమ్మెల్యేలకు వచ్చిన మెజార్టీలా?, లేక పార్లమెంట్ సభ్యులకు వచ్చిన మెజార్టీలా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక నియోజకవర్గానికి సగటున పోలైన 2 లక్షల ఓట్లలో చాలా చోట్ల మూడు వంతులు ఎన్డీఏ కూటమి పార్టీలకు రావడంపై వైసీపీ అభ్యర్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2014 అసెంబ్లీ, 2019 ఎన్నికల్లో వైసీపీ వరుస విజయాలు సాధిస్తున్న నియోజకవర్గాల్లో సైతం ఎన్డీఏ కూటమి పార్టీల నేతల గెలుపై ఈవీఎం పనితీరునే కారణాలుగా చూపుతున్నారు. ఓటమి పాలైన అభ్యర్థులూ వివిధ అంశాలను చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో రాయలసీమ నుంచి వైసీపీకి 52 సీట్లకుగాను 49 సీట్లు కైవసం చేసుకోగా... ఈసారి ఆ ప్రాంతంలో ఘోర పరాజయం పొందిందని అంటున్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు సీట్లలో 36కుగాను 32 సీట్లను సాధించగా, ఈ సారి కేవలం రెండు, మూడు సీట్లకే పరమితమైంది. అక్కడ గెలిచిన మెజార్టీలు భారీగా ఉండటంతోనే తమకు సందేహాలు వ్యక్తమవుతున్నాయని వైసీపీ నేతలు పేర్కొంటున్నారు. ఎన్నికల ఫలితాల ముగిసిన రోజు సీఎం జగన్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఆ సందర్భంగా కూటమి అభ్యర్థులు చంద్రబాబు, పవన్‌కు జగన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాను అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మలకు, రైతులకు ఏం తక్కువ చేశానని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీకి ఇంత తక్కువగా ప్రజలు తీర్పు ఇవ్వడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఎన్నికల విధానంలో ఏదో తప్పు జరిగినట్లుగా అంటున్నారని, దానిపై ఆధారాలూ లేవని జగన్ వ్యాఖ్యానించారు. జగన్ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజు నుంచి ఆ పార్టీ నేతలు ఓటమి నుంచి జీర్ణించుకుని మీడియా ముందుకు వస్తున్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపులో తమకు ఈవీఎంలపై అనుమానాలున్నాయని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై దుష్ప్రచారం చేశారన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఫలితాల్లో ఓటమి అంచనాలు, కూడికలు, తీసివేతలను వేసుకుని... తాము నియోజకవర్గంలో వేలాది మందికి ఇళ్ల పట్టాలు, సంక్షేమ పథకాలు అందించామనేనా? ఓడించారంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల విధానంలో ఏదో సాంకేతిక తప్పిదం జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. సీఎంవోలో కొందరు అధికారులు సీఎం జగన్‌ను తప్పుదోవ పట్టించారని రాజా ఆరోపించారు. ధనుంజయ రెడ్డి ఏకపక్ష పోకడలతోనే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. మరో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సింగపూర్‌లో కుర్చీలో కూర్చుని ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయించారా?, మరేదైనా ప్రాంతం నుంచి చేశారా? అని ప్రశ్నించారు. వ్యక్తిగతంగా కాకుండా, సాంకేతికంగా ఏమైనా ట్యాంపరింగ్ జరిగిందా? అని వ్యాఖ్యానించారు. బార్ కోడ్ల ద్వారా ట్యాంపరింగ్ జరిగిందన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఈవీఎంల స్కామ్‌కు పాల్పడ్డారని, త్వరలో దీనిపై స్పష్టత వస్తుందన్నారు. తన నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్కామ్ జరిగిందని, దీనిపై తాము కోర్టుకు కూడా వెళతామని తెలిపారు. ఏపీ ఫలితాలను చూస్తే... సీఎం జగన్ ప్రజలకు ఏమీ చేయలేదన్నట్లుగా పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు ఎంపిక చేసుకున్న నియోజక వర్గాల్లోని బూత్‌ల్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. త్వరలోనే ఈ ట్యాంపరింగ్ సమాచారం తెలుస్తుందని ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ సలహాదారు పదవికి సజ్జల రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు పదవికి సజ్జల రామకృష్ణారెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కు పంపారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు మరో 20 మందికిపైగా సలహాదారులు తమ పదవుల రాజీనామాలను సీఎస్‌కు పంపినట్లు తెలిసింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమ చంద్రారెడ్డి, జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ తదితరులు రాజీనామాలు చేసిన వారిలో ఉన్నారు. తనను రిలీవ్ చేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కడప ఆర్కిటెక్చర్ వర్సిటీ రిజిస్ట్రార్ పదవి నుంచి రిలీవ్ చేయాలని ఈసీ సురేంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు.

జగన్ వ్యాఖ్యలు సిగ్గుమాలినవి

టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలే తనను మోసం చేశారంటూ వైఎస్ జగన్ మాట్లాడటం సిగ్గుమాలినవని టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విమర్శించారు. ప్రజా తీర్పుపై ఆత్మ విమర్శ చేసుకోకుండా ప్రజలపై నెపాన్ని నెట్టడం సిగ్గుచేటన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జగన్ అరాచక, నిరంకుశ, నియంతృత్వ పాలనను కూకటి వేళ్లతో ప్రజలు పెకిలించారని తెలిపారు. జగన్ చెప్పిట్లే ఏపీ ఫలితాలు చూసి దేశం ఆశ్చర్యపోయిందని, ప్రజలు ఇచ్చిన తీర్పు, 5 కోట్ల ఆంధ్రుల విజయమని అన్నారు. అమ్మఒడి ఇచ్చిన అమ్మలు, అవ్వతాతలు మోసం చేశారనడం దారుణమన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రత్యేక హోదా సాధించలేదు, సీపీఎస్ రద్దు చేయలేదు, జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు, మెగా డీఎస్సీ వదల్లేదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను జగన్ మోసం చేసినందుకే ఈ తీర్పు ఇచ్చారన్నారు. రాజధాని పేరుతో మూడు ముక్కలాటాడి రాజధానికి ఒక్క ఇటుక రాయి కూడా వేయకుండా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసినందుకు, ఏపీకి జీవనాడిగా మారే పోలవరాన్ని ముంచినందుకే వైసీపీని గద్దె దించారన్నారు. ఈవీఎంల తీర్పుపై వైసీపీ నేతల మాటలు ప్రజాస్వామ్య తీర్పును కించపరచడమేనని ఆయన అన్నారు.

సంపాదకీయం

పావులు కదిపే స్థితిలో చంద్రబాబు

పద్నాలుగేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అధికారానికి దూరంగా ఉండాలంటే కష్టమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొమ్మిదేళ్లు, రాష్ట్ర విభజన తరవాత విడిపోయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడుకు గత అయిదేళ్ల నుంచి అధికారానికి దూరంగా ఉండాల్సి రావడంతో తల్లడిల్లి పోయారు. శాసనసభలో తన భార్య భువనేశ్వరిని అవమానపరిచారని, అలాంటి శాసన సభలో ముఖ్యమంత్రిగా తప్ప అడుగు పెట్టనని ప్రతిజ్ఞచేసి దాదాపు మూడేళ్లయిన తరవాత శాసనసభ ఎన్నికల్లో తన పాత ప్రత్యర్థిని ఓడించారు. 175స్థానాలున్న ఆంధ్రప్రదేశ శాసనసభలో 135 సీట్లు సంపాదించారు. తెలుగుదేశానికి మిత్రపక్షమైన పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జన సేనతో చంద్రబాబునాయుడు పొత్తు పెట్టుకున్నారు. జనసేన పార్టీ ఏర్పడి పదేళ్లయింది. కానీ ఈసారి మాత్రం పోటీ చేసిన 21స్థానాల్లోనూ గెలిచింది. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలలో ఘోరంగా ఓడిపోవడానికి కారణాలు ఎన్నైనా ఉండొచ్చు. కానీ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి విజయం సాధించడానికి నిర్దిష్టమైన కారణం చూపడం కష్టమే. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సైతం మిగతా అన్ని పక్షాలలాగే సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలుచేసినా జనం ఆయన పార్టీని సాగనంపారు. పరిపాలనలో లోపాలు, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరించిన తీరు, ముఖ్యంగా చంద్రబాబు నాయుడును నైపుణ్యాభివృద్ధి పథకంలో అవకతవకల పేరుతో అరెస్టు చేయడంవల్ల పెద్దగా సానుభూతి లభించిన దాఖలాలూ కనిపించలేదు. కానీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ఊహించని రీతిలో అపూర్వమైన విజయం సాధించింది. పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన, బీజేపీని కలిపి చంద్రబాబు నాయుడు ఏర్పాటుచేసిన కూటమివల్ల మంచి ప్రయోజనమే కలిగింది. విచిత్రం ఏమిటంటే దేశ వ్యాప్తంగా మోదీ నాయకత్వంలోని బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావలసిన మెజారిటీ సాధించలేక పోయింది. నిజానికి ఆంధ్ర ప్రదేశ్ లో బీజేపీకి చెప్పుకోదగ్గ బలమూ లేదు. అయినా బీజేపీ ఎనిమిది శాసన సభా స్థానాలు, మూడు లోకసభా స్థానాలు సాధించడం విచిత్రమే. తెలుగు దేశం, జన సేన, బీజేపీ బలం ఆధారంగా కాకుండా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మీద పేరుకుపోయిన అసంతృప్తే కూటమిని గెలిపించినట్టు కనిపిస్తోంది. వచ్చే తొమ్మిదో తేదీన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారంటున్నారు. ఆయన ముఖ్యమంత్రి కావడం ఇది నాల్గో సారి.

అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు అమలుచేసినా ప్రజలు కృతజ్ఞతా భావంతో మరోసారి గెలిపిస్తారనే భరోసా లేదు. ఎందుకంటే దాదాపు అన్ని రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాల అమలు మీద శ్రద్ధ చూపుతున్నాయి తప్ప ఉపాధి, ఉత్పత్తి పెంచే విధానాలను బొత్తిగా పట్టించుకోవడం లేదు. ప్రజలకు కల్పించే సదుపాయాలే తమను గట్టెక్కిస్తాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. 1983లో ఎన్‌టీ రామారావు మొదటిసారి అధికారంలోకి వచ్చిన రోజుల్లో అయితే రెండు రూపాయలకు కిలో బియ్యం లాంటి సంక్షేమ పథకాలవల్ల ఓట్లు రాలి ఉండవచ్చు. ఆ తరవాత సంక్షేమ పథకాలు అమలు చేయని ప్రభుత్వమే కనిపించదు. కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎవరూ అడక్కుండానే రూపాయికి కిలో బియ్యం పథకం అమలు చేశారు. కానీ ఆ తరవాతి ఎన్నికలలో ఆయనను పట్టించుకున్న వారేలేరు. ఆ తరవాత ఆయన రాజకీయాలనుంచే మాయమయ్యారు. పోటీలుపడి సంక్షేమ పథకాలు ప్రకటించడంవల్ల అంతగా ప్రయోజనం ఉండదని ఇటీవలి ఎన్నికలలో అనుభవంలోకి వస్తోంది. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి విజయం సాధించడం ఒక్కటే మహత్తరమైన అంశం కాదు. కేంద్రంలో బీజేపీకి సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగిన మెజారిటీ రాకపోవడం చంద్రబాబుకు జాతీయ రాజకీయాల్లో అనుకూలించే అంశం. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జె.డి.(యు), తెలుగుదేశం మద్దతు లేకపోతే మోదీ ప్రభుత్వం పదిలంగా నడిచే అవకాశం లేదు. మోదీ నాయకత్వంలో బీజేపీ బలం గణనీయంగా తగ్గడంవల్ల చంద్రబాబు నాయుడు జాతీయ రాజకీయాల్లో మరోసారి చక్రంతిప్పే అవకాశం వచ్చింది. గతంలో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పాటు చేయవలసి వచ్చినప్పుడు దేవగౌడ ప్రధానమంత్రి కావడంలో చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారు. దేవగౌడ ప్రభుత్వం ఏడాదికాలం కూడా మనలేకపోయింది. ఆ తరవాత ఐ.కె.గుజ్రాల్ ప్రధాని కావడంలో, అదే సమయంలో ఎ.పి.జె. అబ్దుల్ కలాం రాష్ట్రపతి కావడంలోనూ చంద్రబాబు పావులు కదిపే అవకాశం వచ్చింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ఘనవిజయం సాధించిన దశలో కూడా ఆయనకు మళ్లీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశం వచ్చింది. చంద్రబాబు నేతృత్వంలోని తెలుగు దేశం పార్టీ గతంలోనూ బీజేపీతో కలిసి కేంద్రంలో అధికారంలో భాగస్వామి అయింది. తెలుగు దేశం నాయకుడు జి.ఎం.సి. బాలయోగికి లోకసభ స్పీకర్ అయ్యే అవకాశమూ దక్కింది. ఒకప్పుడు కేంద్రంలో "కింగ్ మేకర్" పాత్ర పోషించిన చంద్రబాబు ఇప్పుడు కూడా అదే పాత్ర పోషించగలిగిన పరిస్థితుల్లోనే విజయం సాధించారు. అయిదేళ్ల కింద అధికారం కోల్పోయిన తరవాత రాజకీయాల్లో తాను, తన నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ క్రియాశీలంగా కనిపించడానికి చాలా ప్రయాసపడ్డారు. కానీ ఫలితం కనిపించలేదు. ఏ అంశం ఆధారంగా జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలో తేల్చుకోలేక పోయారు. పైగ తెలుగు దేశం లాంటి పార్టీలు ఉద్యమ నేపథ్యం నుంచి పరిణామ క్రమంలో వచ్చినవి కావు. నిజానికి తెలుగు దేశం పార్టీ, జన ఎన కూడా కేవలం ప్రాంతీయ పార్టీలే. పేరులో మాత్రమే జాతీయ పార్టీ అంటున్నారు అనడం కన్నా అనుకుంటారు అనడమే సబబుగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతీయ పార్టీలకు ప్రాంతీయ ప్రయోజనాలు తప్ప నిర్దిష్ట రాజకీయ భావజాలం, సిద్ధాంతం లాంటివి ఏమీ ఉండవు. తాము సెక్యులర్ వాదులమని చెప్పుకోవడం, అని చెప్పుకునే తత్వం అన్ని ప్రాంతీయ పార్టీలలోనూ కనిపిస్తుంది. ఒక్క లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్.జె.డి.) మినహా ప్రాంతీయంగా మాత్రమే బలంగా ఉన్న పార్టీలన్నీ ఏదో ఒక దశలో బీజేపీతో అంటకాగినవే. అధికారం కోసం, అస్తిత్వం కోసం సెక్యులర్ విధానాలను అటకెక్కించినవే. ఈ దశలో బాబు నాయకత్వంలోని కూటమి విజయం సెక్యులరిజాన్ని పదిల పరిచడానికి చేసేది ఏమీ ఉండదు. కేంద్రంలో మోదీకి మద్దతు ఇవ్వడానికి చంద్రబాబు నాయుడు కోరికల జాబితా సుదీర్ఘంగానే ఉంటుంది. ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హోదా మళ్లీ తెరమీదకు రావడం ఖాయం. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ హోదా కల్పించడం కష్టమే. అమరావతిలో రాజధాని నిర్మాణం వంటి బాబు ఆత్మకు ఇంపైన అంశాలు ఏమవుతాయో చూడాల్సిందే.

నాడీ నిదానం-యోగేంద్ర యాదవ్



ఎన్నికలు ముగిసిన తరవాత వివిధ పక్షాల జయాపజయాలను అంచనావేసే ఎగ్జిట్ పోల్ సంస్థలే గ్రాహకులు కోరిన రుచులు వండి వార్చగలిగిన పాక శాస్త్ర నిపుణులుగా మారిపోయారు. గత ఒకటవ తేదీన పేరున్న కనీసం అరడజను సంస్థలు ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. అందులో అన్నీ గురికి మైలు దూరంలో ఉన్నవే. కూడబలుక్కున్నట్టు అన్ని ఎగ్జిట్ పోల్ నిర్వహణా సంస్థలు సగటున బీజేపీకి 350 సీట్లకు తగ్గకుండా వస్తాయని చెప్పినవే. ఎగ్జిట్ పోల్ నిర్వహించే వారికి ఉన్న పరిమితులను అర్థం చేసుకోవచ్చు. కానీ దీన్నీ ఓ ప్రత్యేక విద్యగా పరిగణిస్తున్నాం. నమ్మే అవకాశాలను అన్వేషిస్తున్నాం. సాధారణంగా వెలువరించే ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో ఒకటో రెండో వాస్తవానికి దగ్గరగా ఉంటే మురిసిపోతాం. కానీ ఈసారి అన్ని ఎగ్జిట్ పోల్ సంస్థల సర్వేల అంచనాలూ తప్పాయి. అందులో ఆశ్చర్యం లేదు కానీ తప్పుడు ఫలితాలు వెల్లడించడంలో వాటన్నింటి మధ్య ఉన్న ఐక్యత అపూర్వమైంది. పోలింగ్ జరగడానికి ముందు కూడా అనేక మంది ఎన్నికల నిపుణులు తమ అంచనాలు వెలువరించారు. వీటిలో కొన్ని వృత్తి పరమైన సంస్థలూ ఉన్నాయి. కొన్ని సంస్థలు గాలి వాటాన్నిబట్టి అంచనా వేసే ప్రయత్నం చేశాయి. బీజేపీ గెలుస్తుందని చెప్పకపోతే పాపం తగులుతుందే మోనన్న భయంతో సర్వే ఫలితాలను వెలువరించి నట్టు కనిపించింది. ఈ క్రమంలో ఒకే ఒక్క వ్యక్తి విశిష్టంగా నిలిచారు. ఆయన యోగేంద్ర

ఒకే ఒక్కడు

- అనన్యవర్మ

యాదవ్. ఒకప్పుడు ఆయన ఎన్నికల సర్వేలు నిర్వహించే వారు. ఈ పనిచేసే వారిని సెఫాలజిస్టులు అంటారు. తాను ఇప్పుడు సెఫాలజిస్టును కానని యోగేంద్ర యాదవ్ పదే పదే చెప్తుంటారు. అయినా వివిధ టీవీ చానళ్లు, యూ ట్యూబ్ చానళ్లు ఆయన అభిప్రాయానికి, అంచనాకే ఎక్కువ విలువ ఇస్తాయి. ఈ మధ్య కాలంలో యోగేంద్ర యాదవ్ అనేక చానళ్లలో ఎన్నికల ఫలితాలపై తన అంచనా తెలియజేశారు. ఈ విషయంలో ఆయన ఒక్కడి అంచనానే అసలు ఫలితాలకు బాగా దగ్గరగా ఉంది. ఆయన మొదటి నుంచీ బీజేపీకి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 272 సీట్లు రావనే చెపుతూ వచ్చారు. మహా అయితే 250 రావచ్చునన్నారు. ఇంకా మాట్లాడితే 230కి కూడా తగ్గొచ్చునన్నారు. ఎలక్ట్రానిక్ ఓటరు యంత్రాలలో నిక్షిప్తమైన ఫలితాలను ఓట్ల లెక్కింపు ప్రారంభం కాక ముందే చెప్పడం అంచనా అవుతుంది తప్ప వాస్తవం కాదు. కానీ యోగేంద్ర యాదవ్ ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీకి వచ్చే సీట్లకు మించి రావు అంటూనే ఉన్నారు. చివరకు అదే నిజమైంది. మరో పది సీట్లు బీజేపీకి తగ్గాయి కూడా. ఆ మాత్రం వ్యత్యాసం ఎవరి అంచనాలోనైనా సహజమే. యోగేంద్ర యాదవ్ వాస్తవానికి అంత దగ్గరగా ఎలా అంచనా వేయగలిగారు అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుంది. యోగేంద్ర యాదవ్ పడక కుర్చీ ఎన్నికల సర్వే నిపుణుడు కాదు. ఎన్నికల క్రమంలో ఆయన అనేక రాష్ట్రాలలో పర్యటించి పరిస్థితిని ఆకళింపు చేసుకున్నారు. జనంతో మాట్లాడారు. వారి అభిప్రాయాన్ని పసిగట్ట దానికి దీక్షగా పని చేశారు. అంతకు ముందు రాహుల్ గాంధీ దేశం దక్షిణ కొస నుంచి ఉత్తర కొస దాకా భారత్ జోడో పేరుతో పాదయాత్ర చేసినప్పుడు యోగేంద్ర యాదవ్ అందులో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ ఎంత దీక్షగా పనిచేసినా ఇంకా సాధించవలసింది చాలా ఉందని ఆయన పదే పదే చెప్పారు. అంతిమ ఫలితాలు అదే నిరూపించాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని "ఇండియా" ఐక్య సంఘటన మెజారిటీకి దూరంలో మిగిలిపోయింది. బీజేపీకి 400 సీట్లకన్నా ఎక్కువ వస్తాయన్నది కేవలం గాలి మాటే. బీజేపీకి 300 సీట్లు రావడమే కష్టం అని యోగేంద్ర యాదవ్ మొదటి నుంచీ చెప్తూనే ఉన్నారు. ప్రతి విడత పోలింగ్ పూర్తి అయిన తరవాత బీజేపీ వెనకపట్టు పట్తున్న తీరును సాధికారికంగానే వివరించారు. యోగేంద్ర యాదవ్ కు చాలా కాలం నుంచి రాజకీయాలతో సంబంధం ఉంది. ఆయన ఫక్తు రాజకీయ జీవి. కానీ ఆయన రాజకీయాలు భిన్నమైనవి. ఆమ్ ఆద్మీ పార్టీ ఏర్పడినప్పుడు యోగేంద్ర కూడా అందులో చేరారు. కానీ ఎక్కువకాలం ఇమడలేక పోయారు. ప్రశాంత్ భూషణ్‌ను, యోగేంద్ర యాదవ్‌ను కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీలోంచి తొలగించారు. ఆ తరవాత ఆయన స్వరాజ్ ఇండియా పార్టీ నెలకొల్పారు. ఆ పార్టీని రాజకీయాధి,కారం సాధించే సాధనంగా మార్చాలన్న ఆలోచన యోగేంద్ర యాదవ్‌లో ఎన్నడూ కనిపించలేదు. ఓ పార్టీ ఉంటే గుర్తింపు ఉంటుందనుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగినన్ని సీట్లు బీజేపీకి రావు కానీ ఎన్.డి.ఎ. పక్షాలతో కలిపి ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుందని చెప్పింది కూడా ఆయనే. ఎన్నికల సర్వేలు చేయడంలో యోగేంద్ర యాదవ్ కు ఉన్న నైపుణ్యం ఎంత అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. ఆయన ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉండే పద్ధతిలోనే ఆలోచిస్తారు. అందువల్ల ఆయన అంచనా సత్య దూరంగా ఉండదు. ఎన్నికలలో గెలుపు ఓటములను ఆయన స్వీయ మానసిక దృష్టితో చూడరు కనకే నిరపేక్షంగా ఆలోచించ గలుగుతారు. మీరు వేసిన అంచనాలు రెండుసార్లు తప్పాయి కదా అని ప్రసిద్ధ పత్రికా రచయిత కరణ్ థాపర్ సాక్షాలతో సహా ఎత్తి చూపినందుకే ప్రశాంత్ కిశోర్ అనే ఎన్నికల వ్యూహకర్త తాచుపాములా బుస కొట్టారు. మర్యాద అతిక్రమించి ప్రవర్తించారు. ఎవరి అంచనాలైనా నిజమూ కావచ్చు. లేదా ఘోరంగా తప్పనూ వచ్చు. లేదా వాస్తవానికి కొద్ది దూరంలో ఉండిపోవచ్చు. ఘోరంగా అంచనా తప్పినప్పుడు ఎవరైనా తమ పొరపాట్లను గ్రహించడానికి ప్రయత్నం చేస్తారు. అందులో యోగేంద్ర యాదవ్ అగ్రగామి.

ఓటర్ల వేటుతో మోదీకి శృంగ భంగం



డివివియస్ వర్మ

ఎన్నికలు ముగిశాయి. ఫలితాలూ వచ్చేశాయి. మళ్ళీ మోదీ సర్కార్ రాబోతుంది. ఈ సారి మోదీ స్వంత కాళ్ళ మీద అందలం ఎక్కడం లేదు. రెండు ఊత కర్రల సాయంతో కుర్చీని అతి కష్టం మీద అందుకోబోతున్నారు. ఈ ఎన్నికలలో దేశ ప్రజలు తమ ఓటుతో మోదీకి శృంగ భంగం చేశారు. ఇది నైతికంగా మోదీకి పరాజయం. రాజ్యాంగం మీద దాడికి సిద్ధమైన మోదీ పరివారం దూకుడికి ప్రజలు కళ్ళెం వేశారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, ఒకే దేశం ఒకే ఎన్నిక, ఒకే నేత అన్న మోదీ గ్యారంటీకి ఓటర్లు బ్రేకు వేశారు. అందుకే ఇది ఘనమైన ప్రజావిజయం. ప్రజాస్వామ్యాన్ని మట్టుపెట్టాలని, విద్వేష రాజకీయం కోసం మోదీ తలపెట్టిన వికృత క్రతువును భగ్నం చేసిన జనవిజయం ఇది. ఓటర్ల తీర్పులో పాలక, ప్రతిపక్షాలు నేర్చుకోవలసిన గుణ పాఠాలున్నాయి. ఓటర్లుగా వ్యవహరించే మనకు స్ఫూర్తినిచ్చే అంశాలు వున్నాయి.

మొదటగా ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలు చాలా మందిని ఆశ్చర్యపరిచాయి. మోదీ ఆ రాష్ట్రం నుంచే పోటీ చేశారు. యోగీ ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్నారు. వీరిద్దరూ అజేయుల కింద లెక్క. పైగా ఈ రాష్ట్రంలోనే అయోధ్య లో రామాలయాన్ని నిర్మించారు. దానిపేరు మీద దేశం మొత్తం మీద ఓట్లు దండుకోగలమని భావించారు. ఉత్తరప్రదేశ్‌లో ఆలయంఉన్న ఫైజాబాద్‌లోనూ బీజేపీ ఓటమిపాలైంది. నిత్య జీవితం సంకటితమైనప్పుడు ప్రజలు తమ ఓటు శక్తిని ప్రయోగిస్తారు. ప్రజలు తలుచుకుంటే అజేయులంటూ ఎవరూ వుండరని అందరూ పరాజితులే అవుతారని రుజువు చేశారు. మోదీ హవా, సమ్మోహనా శక్తి తాత్కాలిక నీటి బుడగలేనని తేల్చేశారు.

ఈ ఎన్నికలకు మరొక ముఖ్యమైన ప్రత్యేకత వుంది. ఎన్నికల ప్రచారంలో సిద్ధాంత పరమైన, విధాన పరమైన అంశాలు ప్రధాన పాత్ర పోషించడం ఒక కొత్త మేలి మలుపు. ఇండియా కూటమి ఈ చర్చను సమర్థవంతంగా నిర్వహించింది. ప్రజాస్వామ్యాన్ని, పౌరస్వేచ్ఛనే కాదు దళితులకు, ఆదివాసీలకు, బహుజనులకు, మైనారిటీలకు రక్షణ కవచంగా వున్న రాజ్యాంగాన్ని పరిరక్షించే ఎన్నికల పోరాటంగా రాహుల్ గాంధీ ప్రకటిస్తూ రాజ్యాంగ పుస్తకాన్ని చూపిస్తూ చేసిన ప్రసంగాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ మత విద్వేష సిద్ధాంతాలను ఇండియా కూటమి ఎండగట్టింది. కులగణన ద్వారా సామాజిక న్యాయాన్ని అందించే అవకాశాలను ప్రచారంలోకి తెచ్చింది. రాజకీయం అంటే అదానీలకు, అంబానీలకు దేశాన్ని దోచిపెట్టడం కాదంటూ మోదీ పాలన ప్రజల కోసం కాదని ప్రచారం చేసింది. రానున్న కాలంలో పార్టీల మధ్య జరిగే సిద్ధాంత సంఘర్షణ కు ఈ ఎన్నికల ప్రచారం దారి చూపించేది గా వుంది

ఈ ఎన్నికల ప్రచారం రెండు కూటములూ రెండు భిన్నమైన ధోరణుల్లో సాగించాయి. ఇండియా కూటమి సిద్ధాంత పరమైన అంశాలతో పాటు ప్రజా సమస్యల చుట్టూ, నిర్దిష్ట మైన తక్షణ ఉపశమన పథకాల చుట్టూ ప్రచారాన్ని సాగించాయి. దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగాన్ని ప్రచారాస్త్రంగా మలిచింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోదీ వాగ్దాన భంగంపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఖాళీగా వున్న 30 లక్షల ఉద్యోగాల భర్తీ తోపాటు, నిరుద్యోగులకు అప్రెంటీస్‌షిప్ పథకాన్ని ప్రకటించారు. పూనకం వచ్చినట్టు " మోదీ మోదీ" అంటూ కేరింతలు కొట్టిన చాలా మందిని యువతని ఆకర్షించగలిగారు.

నిత్యజీవితంతో చెలగాటం ఆడుతున్న ధరల పెరుగుదలను మరో ప్రచార సాధనం చేసుకున్నారు. ధరలు తగ్గించడానికి మోదీ ప్రవేశ పెట్టిన తప్పుడు జియస్‌టీ ని సరిదిద్దుతామని, పేద కుటుంబాల మహిళలకు నగదు బదిలీ ద్వారా ఉపశమనం కల్పిస్తామని ప్రచారం చేశారు.రైతుల పంటలకు లాభసాటి ధరలు వచ్చేలా కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేస్తామని ప్రచారం చేశారు. మహిళలపై అత్యాచారాల దోషులపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపకపోగా నిందితులను ఎలా అక్కున చేర్చుకున్నదీ బ్రిజ్ భూషన్, బిల్కిస్ బానో కేసులో నిందితులకు క్షమాభిక్ష పెట్టడం, మణిపూర్ అత్యాచారాలపై మౌనం పాటించడం వంటి అంశాలు ప్రచారంలో భాగం చేశారు.

మరో పక్క మోదీ తన పదేళ్ళ పాలనపై తీర్పు చెప్పమని కోరే సాహసం చెయ్యలేదు. ప్రజాసమస్యలపై చర్చ సాగకుండా పక్కదారి పట్టించడానికి రోజుకో వివాదాస్పద అంశాన్ని ప్రచారంలోకి తెచ్చారు. మోదీ తన పేరులోని మొదటి అక్షరం " మ" తో ప్రారంభమయ్యే పదాల నినాదాలు ఎంతగా వాడితే అంతగా ఓట్ల వరద పారుతుందన్న జ్యోతిష్యాన్ని నమ్ముకుని దాని చుట్టూ ప్రచారాన్ని రూపొందించుకున్నారు. మతం, మందిరం, మసీదులతో సరిపెట్టు కోకుండా మచిలీ, మటన్, మంగళ సూత్రం, చివరికి ముజ్రా దాక సాగలాగారు. మొత్తం మీద ఇండియా కూటమి " పాజిటివ్" ప్రచారం చేసి లాభపడింది. మోదీ " నెగిటివ్" ప్రచారానికి దిగి చతికిలపడ్డారు .

ఒకే దేశం ఒకే ఎన్నికను ఉమ్మడి పౌరస్మృతి అన్నది మోదీ ఎన్నికల నినాదం. ఈ దేశంలో వున్న భిన్నత్వాన్ని మోదీ సర్కారు గుర్తించదు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి పేరుతో ప్రాంతీయ ప్రత్యేకతల్ని, వారి ఆకాంక్షల్నీ, వాటికి ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడమే దీని లక్ష్యం. ఈ ఎన్నికలలో ప్రాంతీయ ప్రత్యేకతల ముందు మోదీహవా సాగదని తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబు కొంత మేరకు మహారాష్ట్రలు తీర్పు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంతో పొత్తు లేకుండా పోటీచేస్తే బీజేపీకి ఇక్కడ ప్రవేశం వుండేది కాదు. మోదీ వచ్చి ప్రచారం చేసినా వారికి ఎక్కడా డిపాజిట్లు కూడా దక్కేవి కావు. దేశంలో ప్రాతీయ వైవిధ్యానికి గల శక్తిని ఈ ఎన్నికలు ధృవపరుస్తున్నాయి.

ఎన్నికలలో మోదీ అనుకున్నది ఒకటైతే ఓటర్ల తీర్పు మరొకటైంది. మోదీ కోరిన 370 సీట్లకి ఓటర్లు జై కొట్టలేదు. 239కి దించి కూర్చో పెట్టారు. ఇప్పుడు మిత్రపక్షాలుగా వున్న చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌లు లేకపోతే మోదీకి ప్రధాని పదవి గల్లంతయ్యేది. అయితే ఈ ఇద్దరు నిన్నటి శత్రువులు, నేటి మిత్రులు. చంద్రబాబు 2018లో ఎన్‌డీఏ నుంచి బైటకు వచ్చి కాంగ్రెస్‌తో కలిశారు. 2023 నితీష్‌కుమార్ ఎన్‌డీఏ నుంచి ఇండియా కూటమికి తిరిగి ఎన్‌డీఏ కూటమికి చేరారు. ఒకప్పుడు మోదీ పంచన చేరి అడుగులకు మడుగులొత్తినవారు ఇప్పుడు చక్రం తిప్పేవారయ్యారు. వీరిద్దరికీ రాష్ట్రంలో ముఖ్యమంత్రుల పదవులే ముఖ్యం మిగిలినవన్నీ తర్వాతే. గతంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అన్నది బలమైన ఎన్నికల సమస్య కాగానే ఆయన ఎన్ డి ఎ ను వదిలి పెట్టారు. ఇక్కడ రాజకీయంగా తనకు ముప్పు వాటిల్లే సమస్య ఎదురైతే ఎన్‌డిఎ ను వీడతారో గాని మోదీ కోసం రాష్ట్రాన్ని వదులుకోరు. ఇదే నితీష్ కీ వర్తిస్తుంది.

మొత్తం మీద మోదీ ప్రభుత్వం మైనారిటీ ప్రభుత్వం. దినదిన గండంతో గడిచే ప్రభుత్వం. ఈ ఎన్నికలు "బాహుబలి" మోదీ ని ఇతరుల దయా దాక్షిణ్యాల మీద ఆధార పడి ప్రభుత్వాన్ని నడుపుకునే చేదు అనుభవాన్ని ఓటర్లు చవిచూపించారు.

ఈ తీర్పు రాజ్యాంగ పరిరక్షణకు, ఆధిపత్య ధోరణుల మీద, ఫాసిస్టు పోకడల మీదా పోరాడే వారికి ప్రజలను జాగృతం చెయ్యడానికి తగిన సమయాన్ని, అవసరమైన భూమికను ఇచ్చింది. అందుకే ఇది అభినందనీయమైన ప్రజా తీర్పు.

దారి దీపం సంపాదకులు
సెల్: 85006 78977

ప్రజాస్వామ్యమే విజేత

నిత్య చక్రవర్తి

తాజా లోక్‌సభ ఎన్నికలలో ప్రజాస్వామ్యం అతిపెద్ద విజేతగా నిలిచింది. జూన్ 4న ప్రకటించిన ఫలితాలు ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలోని భిన్నత్వాన్ని నొక్కి చెప్పాయి. 64.2 కోట్లమంది ఓటర్ల నుంచి అధికార పార్టీ బీజేపీకి ఏకైక మొనగాడుగా నిలిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందనేది స్పష్టం. గత రెండు నెలలుగా నిరంతరాయంగా చేపట్టిన ప్రధానమంత్రి ప్రచారంలో ఎన్‌డీఏ నిక్కచ్చిగా 400 సీట్లు సాధిస్తుందని, అందులో బీజేపీ లక్ష్యం 370సీట్లుగా ఘనప్రచారం చేశారు. జూన్ 4 ఎన్నికల ఫలితాల్లో ఇది ఖాయమని దేశవ్యాప్తంగా హోరెత్తించారు. అయితే ఎట్టకేలకు అతి కష్టంగా ఎన్‌డిఎ సంఖ్య 290, బీజేపీ 240తో సరిపెట్టుకున్నారు. అయితే 2019 లోక్‌సభ స్థానాల కంటే అరవైకుపైగా సీట్లు తక్కువగా ఉంది. ఇండియా కూటమి ఎన్‌డీఏ కంటే కేవలం అరవై ప్లస్ సీట్లు మాత్రమే వెనుకబడి ఉంది.

దేశాన్ని ప్రధాని మతపరమైన రొంపిలోకి దించేందుకు తీవ్రంగా యత్నించారు. కేంద్రం, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండాలని నినదిస్తూ కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలపై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. దేశంలో ఫెడరలిజాన్ని మట్టునపెట్టి అన్ని అధికారాలను కేంద్రీకృతం చేయాలన్న బీజేపీ లక్ష్యం సరికాదని తాజా ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. ప్రాంతీయ పార్టీల పునరుజ్జీవనం, మైనారిటీలో పడిన బీజేపీ నేతృత్వంలోని నూతన ప్రభుత్వానికి రానున్న రోజులు గడ్డుకాలమే. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్రమోదీ పలుకుబడి పూర్తిగా తగ్గింది. తానువిశ్వగురుగా, దైవదూతగా మోదీ ప్రచారంచేసుకున్నారు. ప్రభుత్వ ఏర్పాటులో ఎన్‌డీఏ మిత్రపక్షాల నుండి మోదీ విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నారనేది సుస్పష్టం. మరోపక్క బీజేపీకి గణనీయంగా సీట్లు తగ్గడం సంఘ్ పరివార్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్‌లోని ఇతర విభాగాలను కించపరిచేలా ప్రధానమంత్రి సహా పార్టీలోని ఆయన సన్నిహితులు తాజా ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారు. హిందూత్వ శక్తుల దృష్టిలో సైతం మోదీ విఫలమయ్యారు.

హిందీ రాష్ట్రాల్లో బీజేపీ పరాజయం పాలవడం రెండో అంశం. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానాకు సంబంధించినంత వరకు బీజేపీ శిబిరానికి ఇది వినాశనమేనని చెప్పవచ్చు. మధ్యప్రదేశ్‌లో కొంతవరకు పట్టునిలుపుకుంది, అయితే రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ బీజేపీలో చేరేందుకు యత్నించడంతో కాంగ్రెస్ గందరగోళానికి గురైంది. ఉత్తరప్రదేశ్‌లో పార్టీ పతనం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సహా బీజేపీ అగ్రనేతల్లో ప్రశ్నార్థకంగా మారింది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ ఈ ఎన్నికల్లో పెద్ద మలుపుగా చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్-ఎస్‌పి కూటమి క్లిక్ అయింది. 2027లో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పొత్తు మరింత ముందుకు దూసుకు వెళ్లనుంది. మూడవది, రాహుల్ గాంధీ తాజా ఎన్నికల్లో ఒక బలీయమైన నాయకుడిగా ఆవిర్భవించాడు. కాంగ్రెస్ ప్రచారాన్ని భారత్ జోడో యాత్రతో రాహుల్ అద్భుతంగా నడిపించాడు. హిందుత్వం, నిరుద్యోగం, ధరల పెరుగుదలతో సహా ప్రధాన సమస్యలపై బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ తన ప్రసంగాల్లో తీవ్రంగా దాడిచేశాడు. నిజానికి, సంకీర్ణ భాగస్వామ్య పక్షాలతో వ్యవహరించగల నాయకుడి పరిపక్వత రాహుల్ ఈ ఎన్నికల ద్వారా చూపించారు. 2024 ఎన్నికలలో కాంగ్రెస్ లోక్‌సభ స్థానాలను దాదాపు రెట్టింపు చేసింది. దేశంలోని 139 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్, ఇండియా కూటమికి సమర్థవంతమైన నాయకత్వంగా పనిచేయడానికి సిద్ధంగా ఉందని ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. ఇండియా కూటమి చాలా రాష్ట్రాల్లో ఈ ఎన్నికల ద్వారా మంచి పనితీరు కనబరిచింది. నియోజకవర్గ పార్టీల

కిందిస్థాయి కార్యకర్తల సమన్వయంతోనే ఇది సాధ్యమైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో చాలామంది యువ నాయకులు ఉద్భవించారు. ఇది మంచి పరిణామం. రాహుల్‌గాంధీతో పాటు, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, ఆదిత్య థాకరే, ఉదయనిధి స్టాలిన్, కల్పనా సోరెన్, అభిషేక్ బెనర్జీ రానున్న రోజుల్లో ఇండియా కూటమికి అగ్రగామిగా ఉండే అవకాశం ఉంది. ఉద్ధవ్ థాకరే, ఎంకె స్టాలిన్ ఇద్దరూ ఉమ్మడి నాయకత్వంతో బీజేపీ, ఎన్‌డిఏలకు షాక్‌లను ఎలా ఇవ్వగలదో చూపించారు. రానున్న రోజుల్లో దేశంలో రాజకీయ పరిస్థితులను ఎదుర్కోవడానికి ఇండియా కూటమి అన్ని స్థాయిల్లో మరింత బలోపేతం కావల్సిఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ మూడ్ నాల్గవ అంశం. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం స్థానంలో టీడీపీ-బీజేపీ కలయిక మరో మైలురాయి. అయితే తమిళనాడు, కేరళలో సైతం బీజేపీ తన ఉనికిని స్వల్పంగా మెరుగుపరుచుకుంది. కర్ణాటకలో, 2019 ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ తన ఎంపీల సంఖ్యను పెంచుకోగలిగింది. అయితే బీజేపీ-జేడీ(ఎస్) కలయిక ప్రభావవంతంగా ఉంది. తెలంగాణలో ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌ని బీజేపీ, కాంగ్రెస్ రెండూ దెబ్బతీశాయి. ఒడిశాలో మళ్లీ ప్రాంతీయ బీజేడీని ఎన్నికల్లో బీజేపీ ఓడించింది. బీజేపీ చేతిలో ఓ ప్రాంతీయ పార్టీ ఓటమి ఊహించని పరిణామం. ప్రాంతీయ పార్టీల విషయంలో టీడీపీ భారీగా లాభపడగా, వైఎస్సార్‌సీపీ, బీఆర్ఎస్, బీజేడీ ఓడిపోయాయి. కానీ మొత్తం మీద, ప్రాంతీయ పార్టీలు అనేక రాష్ట్రాల్లో దూసుకెళ్లాయి. 18వ లోక్‌సభ ఎన్నికలలో ఎన్‌డీఏ ఓట్ల శాతం 46 శాతంకాగా, 2019నాటి గణాంకాల కంటే 2శాతం తక్కువగా ఉంది. 2024 ఎన్నికలలో ఇండియా కూటమి ఓట్ల శాతం 41శాతంతో 8శాతం పెరుగుదల నమోదు చేసింది. ప్రచారం చివరి రోజుల్లో మోదీ స్థాయి తగ్గడం బీజేపీ ఓట్ల తగ్గుదలకు మరో ప్రధానకారణం. ప్రాంతీయ పార్టీలలో పశ్చిమ బెంగాల్‌లో, తృణమూల్ కాంగ్రెస్ 2019 నాటి సంఖ్యను 9 నుండి 10 సీట్లతో మెరుగుపరుచుకుంది. టిఎంసి తన ఓట్ల వాటాను 47 శాతానికి మెరుగుపరుచుకుంది. 2024 ఎన్నికలలో 4శాతం పెరుగుదల నమోదైంది. బీజేపీ ఓట్ల శాతం 3 నుండి 37 శాతానికి తగ్గింది. టీఎంసీ ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు ఉన్నప్పటికీ బీజేపీ, కాంగ్రెస్ వామపక్షాల కలయికను ఓడించి టీఎంసీ తన సంఖ్యను గణనీయంగా పెంచుకుంది. వాస్తవానికి 2024 ఎన్నికలలో ఇండియా కూటమి అధికారానికి చాలా దగ్గరగా ఉంది. 2024 మరొక 2004 అయి ఉండాల్సింది. కానీ అది ఇంకా జరగలేదు. పరిస్థితిని నిజాయితీగా అంచనా వేయడానికి, సమగ్ర వ్యూహాన్ని రూపొందించడానికి ఇండియాకూటమి నాయకులు సమావేశం అయ్యారు. నరేంద్రమోదీ స్థాయి తగ్గిపోతున్న తరుణంలో బీజేపీని ఎదుర్కొనేందుకు ఇండియా కూటమి సభ్యుల ఐక్యతను బలోపేతం చేయడమే వారి ముందున్న తక్షణ ప్రధాన కర్తవ్యం. శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే వంటి అనుభవజ్ఞులు ఎన్‌డిఎ భాగస్వాములైన టీడీపీ, జెడీ(యు), షిండే శివసేన వంటి వారితో సంకీర్ణ భాగస్వామ్యంకోసం ప్రయత్నించవచ్చు.

40 ఏళ్ల తర్వాత కాంగ్రెస్‌కు 12 కోట్ల ఓట్లు

తగ్గిన బీజేపీ ఓట్ల శాతం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యంతో మెజారిటీ మార్క్ దాటేసిన ఎన్డీఏ... ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య పోరు హోరాహోరీగా జరిగింది. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఒక రికార్డు సాధించింది. 1984 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ పార్టీ 12 కోట్ల ఓట్లను సాధించింది. 40 ఏళ్ల తర్వాత హస్తం పార్టీ 12 కోట్లకు పైగా ఓట్లను పొందింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం జరిగిన ఎన్నికల్లో భారీగా ఓట్లు సాధించిన హస్తం పార్టీ ఆ తర్వాత అంతగా రాణించలేకపోయింది. మళ్లీ ఈ సార్వత్రిక ఎన్నికల్లో సత్తా చాటింది. ఎన్నికల కమిషన్ డేటా ప్రకారం, దేశవ్యాప్తంగా జరిగిన 2024 లోక్ సభ ఎన్నికల్లో 64.20 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో కాంగ్రెస్ 13.63 కోట్లకు పైగా ఓట్లను సాధించగా... బీజేపీ 23.45 కోట్ల ఓట్లను పొందింది. మరోవైపు, గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓట్ల శాతం ఈసారి తగ్గింది. అదే సమయంలో కాంగ్రెస్, సమాజ్ వాదీ ఓట్ల శాతాన్ని పెంచుకున్నాయి. 2019లో కంటే ఈసారి ఎక్కువ సీట్లలో బీజేపీ పోటీ చేసింది. కానీ సొంతంగా మెజారిటీ మార్క్‌ను సాధించలేకపోయింది.

36.58శాతం ఓట్లను సాధించింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కమలం పార్టీకి 0.73 శాతం ఓట్లు తగ్గాయి. అదే సమయంలో కాంగ్రెస్ 1.76 శాతం ఓట్లను అధికంగా సాధించింది. 2019లో ఆ పార్టీకి 19.46శాతం రాగా ఈసారి 21.22 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో 2.55శాతం ఓట్లను సాధించిన సమాజ్ వాదీ పార్టీ ఈసారి 4.59శాతం ఓట్లను సాధించింది. కాగా 2019లో జేడీయూకు 1.45శాతం ఓట్లు రాగా ఈసారి 1.25శాతం వచ్చాయి. 2019లో తృణమూల్ కాంగ్రెస్ కు 4.06శాతం ఓట్లు రాగా ఈసారి 4.38శాతం ఓట్లు వచ్చాయి. బీఎస్పీ ఓట్ల శాతం 2.04 నుంచి 1.58కు తగ్గింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఓట్ల శాతం 0.44 నుంచి 1.11కు పెరిగింది. డీఎంకే ఓట్ల శాతం 2.34 నుంచి 1.82కు తగ్గింది.

పెరిగిన ప్రజాదరణ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీయే కూటమి బొటాబొటి మెజార్టీతో అధికారం చేపట్టబోతుంది. భారతీయ జనతా పార్టీ కేవలం 240 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. విపక్ష కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలపడుతోంది. గత ఎన్నికలతో పోల్చితే సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆ పార్టీ కంచుకోట అయిన అమేథీ, రాయ్‌బరేలిలో విజయం సాధించి మంచి ఊపుమీద ఉంది. వంద సీట్లకు చేరువలో సీట్లు సాధించి సత్తా చాటింది. కాంగ్రెస్ పార్టీ ఈ సారి సింగిల్‌గా 99 సీట్లు సాధించింది. గత ఎన్నికల్లో కేవలం 52 సీట్లతో సరిపెట్టుకుంది. 2014లో 44 సీట్లు మాత్రమే గెలిచింది. 2009 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికల్లో మాత్రం ప్రతిపక్షానికి పరిమితమైంది. డబుల్ డిజిట్ సీట్లు మాత్రమే గెలిచి డీలా పడిపోయింది. 2019లో కూడా అలాంటి పరిస్థితి ఎదుర్కొంది. ఆ సమయంలో రాయ్‌బరేలి నుంచి సోనియా గాంధీ విజయం సాధించారు. అమేథీ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ ఓడిపోయారు. కాంగ్రెస్ కంచుకోటలో స్మృతి ఇరానీ పాగా వేశారు. ఈసారి మాత్రం కిశోరీ లాల్ శర్మ చేతిలో స్మృతి ఇరానీ ఓడిపోయారు. సోనియా ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలి నుంచి రాహుల్ గాంధీ పోటీ చేసి విజయం సాధించారు. బీజేపీ నేత దినేశ్ ప్రతాప్ సింగ్‌ను రాహుల్ మట్టి కరిపించారు. వయనాడుతో పాటు రాయ్‌బరేలి నుంచి ఆయన గెలుపొందారు.

ఎన్‌డీయే ప్రభుత్వం, ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేతలు విమర్శలు చేశారు. రాహుల్, ఇతర ముఖ్య నేతలు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా ఆరోపణలు గుప్పించారు. ప్రజలకు మేలు చేయని విధానాలను ఎండగట్టారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చింది. 2019 ఎన్నికల కన్నా 47 సీట్లు ఎక్కువ గెలుచుకుంది. ఇండియా కూటమి అధికారం చేపడుతుందని ఓ దశలో విశ్లేషకులు అంచనా వేశారు. కానీ 234 సీట్ల వద్ద కూటమి ఆగిపోయింది. బీజేపీ కూటమికి మెజార్టీ మార్క్ వచ్చింది. సింగిల్‌గా బీజేపీ 240 సీట్ల వద్ద ఆగింది. ఇందుకు అనేక కారణాలను విశ్లేషిస్తున్నారు. ఎన్నికలకు ముందు 400 సీట్లు గెలుచుకుంటామని బీజేపీ ధీమా వ్యక్తం చేసింది. ఈసారి ప్రజలు మాత్రం ఘోరంగా దెబ్బతీశారు.

ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు: విజయన్

తిరువనంతపురం: ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేసేలా బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు లోక్‌సభ ఫలితాలు గట్టి ఎదురుదెబ్బ అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం అన్నారు. కాషాయ పార్టీకి అనుకూలంగా చేసిన ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై విజయన్ స్పందిస్తూ మతతత్వాన్ని ఉపయోగించి ముందుకు సాగాలన్న, రాజకీయ లబ్ధి పొందాలన్న బీజేపీ ఎత్తులను భారత ప్రజలు విచ్ఛిన్నం చేశారని విజయన్ అన్నారు. త్రిసూర్‌లో బీజేపీ విజయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనిపై సమీక్ష చేయనున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మతోన్మాదాన్ని ప్రజలు తిప్పికొట్టారని తెలిపారు.

మహారాష్ట్రలో 'ఇండియా'కు 30 సీట్లు

ముంబై: మహారాష్ట్రలో ఎన్‌డీయే కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర ప్రజలు ఇండియా కూటమికే జై కొట్టారు. ముఖ్యంగా శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం, ఎన్‌సీపీ శరద్ పవార్ వర్గాలకు ప్రజలు పట్టం కట్టారు. శివసేన, ఎన్‌సీపీ పార్టీలు చీలినా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ వైపు కాకుండా ఉద్ధవ్‌ఠాక్రే, శరద్ పవార్‌వైపే ఓటర్లు మొగ్గు చూపారు. గత ఎన్నికల్లో 48 స్థానాలకు 41 చోట్ల ఎన్‌డీయే కూటమి విజయం సాధించగా... ఈసారి అనుహ్యంగా బీజేపీ తడబడింది. గత రెండు ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన కాంగ్రెస్ ఈసారి డబుల్ డిజిట్ అందుకుంది. మహారాష్ట్రలో మొత్తం 48 ఎంపీ స్థానాలుండగా ఇండియా కూటమి 30 స్థానాల్లో, ఎన్‌డీయే కూటమి 17 స్థానాల్లో గెలిచింది. ఒక స్థానాన్ని ఇతరులు సొంతం చేసుకున్నారు.' ఇండియా కూటమిలో కాంగ్రెస్ 13, శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం 9, ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ 8 సీట్లలో విజయం సాధించింది. ఎన్‌డీయే కూటమిలో బీజేపీ 9, శివసేన-7 సీట్లు, ఎన్సీపీ-1 స్థానంలో గెలుపొందాయి.

'నా ఎత్తెంతో నాకు తెలుసు'

ప్రధాని అభ్యర్థిత్వంపై స్టాలిన్

చెన్నై: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఇప్పుడు అందరి దృష్టి కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుపైనే..! ఎన్‌డీయే కూటమికి స్పష్టమైన ఆధిక్యం లభించినప్పటికీ... అనూహ్య పరిస్థితులు ఎదురైతే ఇండియా ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలు లేకపోలేదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీని గురించి తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను మీడియా ప్రశ్నించింది. 'ఒకవేళ ఇండియా ఐక్య సంఘటనకు అవకాశం లభిస్తే... ప్రధాని అభ్యర్థి రేసులో మీరు ఉంటారా?' అని అడగ్గా... స్టాలిన్ ఆసక్తికరంగా బదులిచ్చారు. తన తండ్రి కరుణానిధి డైలాగ్‌ను ప్రస్తావిస్తూ.. 'నా ఎత్తు ఎంతో నాకు తెలుసు. ఈ విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు చెప్పా' అని విలేకరులతో అన్నారు. ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ... 'గత ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో మా కూటమికి 39 స్థానాలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 40కి 40 సాధించాం. ఈ విజయాన్ని నా తండ్రికి అంకితమిస్తున్నా. చాలా రాష్ట్రాల్లో మోదీ వ్యతిరేక గాలి వీచింది' అని అన్నారు. గతంలో కరుణానిధి 'ఎత్తు' వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల ఆయన 13సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. కానీ, కేంద్రంలో పాలన జోలికి వెళ్లకుండా రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యారు. అయితే 1997లో దేవెగౌడ ప్రభుత్వం పడిపోయాక... కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన కరుణానిధికి వచ్చిందట. ఇందుకోసం నేషనల్ ఫ్రంట్‌లోని కొంతమంది నేతలు ఆయనను సంప్రదించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే, 'నా ఎత్తు ఎంతో నాకు తెలుసు' అంటూ కరుణానిధి నాటి ప్రతిపాదనను తిరస్కరించినట్లు కథనాలు వచ్చాయి.

ఒడిశాలో బీజేడీ ఓటమి ఎందుకు?

- సాదాసీదా ప్రచారం
- పాండ్యన్ ప్రభావం
- పట్నాయక్ ఆరోగ్యంపై కాషాయ పార్టీ దుష్ప్రచారం
- రాష్ట్రం నలుమూలలా బీజేపీ అగ్రనేతల ప్రచారం

భువనేశ్వర్: ఒడిశాలో బీజేడీ నేత నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల పాలనకు తెరపడింది. మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకు గాను బీజేపీ 78 స్థానాలు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 113 సీట్లు గెలుచుకున్న నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ... 2024 ఎన్నికల్లో మాత్రం సగానికి పైగా స్థానాలను కోల్పోవడం గమనార్హం. బీజేడీ 51, కాంగ్రెస్ 14 స్థానాల్లో విజయం సాధించాయి. బీజేపీ 78 సీట్లలో గెలుపొందగా... సీపీఎం-1, ఇండిపెండెంట్లు 3 స్థానాల్లో విజయం సాధించారు. ఇక ఒడిశాలోని 21 లోక్ సభ స్థానాలకు గాను బీజేపీ 20 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక స్థానం కైవసం చేసుకుంది. బీజేడీ ఖాతా తెరవలేకపోయింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో బీజేడీ 12, బీజేపీ 8, కాంగ్రెస్ 1 స్థానంలో విజయం సాధించాయి. అంతకు ముందు 2014 లోక్ సభ ఎన్నికల్లో బీజేడీ 20, బీజేపీ 1, కాంగ్రెస్ 0 సీట్లు గెలుచుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో బీజేడీ ఘోర ఓటమికి ముఖ్య కారణాలను విశ్లేషించినట్లయితే... ఒడిశా ఎన్నికల్లో బీజేపీ ప్రచారంతో పోలిస్తే, బీజేడీ ప్రచారం చాలా బలహీనంగా, చప్పగా సాగింది. బీజేడీ ప్రచారం కేవలం పట్నాయక్, ఆయన సన్నిహితుడు వీకే పాండ్యన్ లకు మాత్రమే పరిమితమైంది. పట్నాయక్ కూడా పరిమిత సంఖ్యలోనే ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. పూరీలోని జగన్నాథుని రత్న భండార్ (ట్రెజరీ) తాళం చెవి కనిపించకుండా పోవడంపై బీజేపీ... బీజేడీ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించింది. ప్రభుత్వాన్ని, పార్టీని ఔట్ సోర్సింగ్ చేస్తున్నారని పట్నాయక్ పై ఆరోపణలు చేసింది. మరోవైపు, తమిళుడైన పాండ్యన్ కు పట్నాయక్ అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడాన్ని బీజేపీ నేతలు తమ ప్రచారంలో ప్రశ్నించారు. అలాగే, పట్నాయక్ అనారోగ్యాన్ని కూడా బీజేపీ ఒక ప్రచారాంశంగా చేసుకుంది. అందుకు పాండ్యన్ యే కారణమనే అనుమానాన్ని ఓటర్లలో రేకెత్తించింది. దీనికితోడు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రజలతో మాట్లాడేందుకు మైక్ కూడా ఎత్తలేకపోవడంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమయింది. పట్నాయక్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించడం వెనుక కుట్ర ఉండొచ్చని బీజేపీ ప్రచారం చేసింది. స్వయంగా ప్రధాని మోదీయే పట్నాయక్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో నవీన్ పట్నాయక్ హింజిలి, కాంతాబంజి స్థానాల నుంచి పోటీ చేశారు. కానీ కాంతాబంజి సీట్లో ఓటమి పాలయ్యారు. హింజిలిలో కూడా ఆయన కేవలం 4636 ఓట్ల తేడాతో గెలవడం గమనార్హం. ఒడిశాను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ అగ్రనేతలు ఒడిశా నలుమూలలా ప్రచారం చేశారు. ప్రధాని మోదీ స్వయంగా రెండు రోడ్ షోలు నిర్వహించడంతో పాటు 10 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. బీజేపీ కేంద్ర నేతలు రాష్ట్రవ్యాప్తంగా కనీసం 245 ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. ప్రధాని మోదీతో పాటు, అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, స్మృతి ఇరానీ, హేమమాలిని వంటి పార్టీ అగ్రనేతలు ప్రచారం చేశారు. లోక్ సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగడం కూడా బీజేపీ కి కలిసివచ్చింది.

బీజేపీ తొలి ప్రభుత్వం

ఒడిశా రాజకీయ చరిత్రలో ఇదే తొలి బీజేపీ ప్రభుత్వం. 2000 నుంచి 2009 వరకు బీజేపీ... బీజేడీతో పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ 2009 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆ కూటమి కూలిపోయింది. బీజేడీకి వ్యతిరేకంగా బీజేపీ 2024 వరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయింది. 2024 ఎన్నికలకు ముందు కూడా బీజేడీ, బీజేపీల మధ్య సీట్ల పంపకాలకు ప్రయత్నించి విఫలం అయ్యారు.

ఫడ్నవిస్ రాజీనామా

పార్టీ పరాజయానికి బాధ్యతని వెల్లడి

ముంబై : లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టేందుకు వీలుగా తనను బాధ్యతల నుంచి తప్పించాలని మాజీ ముఖ్యమంత్రి బీజేపీ నాయకత్వాన్ని అభ్యర్థించారు. బుధవారం మీడియా సమావేశంలో ఫడ్నవీస్ మాట్లాడుతూ 'మహారాష్ట్రలో ఇటువంటి ఫలితాలకు నేను బాధ్యత వహిస్తాను. నేను పార్టీకి నాయకత్వం వహిస్తున్నాను. రాబోయే ఎన్నికలలో పార్టీ కోసం కష్టపడి పనిచేయడానికి నన్ను ప్రభుత్వ బాధ్యత నుంచి తప్పించాలని నేను బీజేపీ అధిష్ఠానాన్ని అభ్యర్థిస్తున్నాను' అని తెలిపారు. నవంబరులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీపై దృష్టి పెట్టేందుకు బీజేపీ నాయకత్వం తనకు సమయం ఇవ్వాలని ఫడ్నవీస్ కోరారు. అంతకుముందు రోజు, బీజేపీ మహారాష్ట్ర విభాగం పేలవమైన పనితీరును విశ్లేషించడానికి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాన్‌కులే, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు. మహారాష్ట్రలో 45 సీట్లను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ గణనీయంగా పడిపోయింది. రాష్ట్రంలో బీజేపీ కేవలం తొమ్మిది లోక్‌సభ స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే పార్టీ సీట్లు 14 తగ్గాయి. దాని మిత్రపక్షాలు, ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ కలిసి ఎన్‌డీఏ 48 సీట్లలో 17 స్థానాలను గెలుచుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీ 23 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) 30 సీట్లను కైవసం చేసుకునేందుకు దాని శక్తి కంటే ఎక్కువ అడుగులు వేసింది. 2019లో రాష్ట్రంలో గెలిచిన ఒకే ఒక స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ 13 సీట్లు గెలుచుకోగా, శివసేన (యూబీటీ) తొమ్మిది, ఎన్‌సీపీ (శరద్‌చంద్ర పవార్) పార్టీ ఎనిమిది సీట్లు గెలుచుకున్నాయి.

ముస్లింలపై మాయావతి అసహనం

లక్నో: ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సాధిస్తామని ధీమాగా ఉన్న బహుజన సమాజ్ వాదీ పార్టీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటు కూడా బీఎస్‌పీ గెలవలేకపోయింది. యూపీలో అత్యధిక సీట్లు సమాజ్ వాదీ పార్టీ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటన గెలుచుకోగా...బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. ఒకప్పుడు యూపీని ఏకచ్ఛత్రాధిపత్యంతో ఏలిన బీఎస్‌పీకి ఒక్క సీటు రాకపోవడంపై ఆ పార్టీ అధ్యక్షురాలు మాయావతి అసహనం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో బీఎస్‌పీ 35 మంది ముస్లింలకు సీట్లు ఇచ్చింది. తమ పార్టీ ముస్లింలకు సరైన ప్రాతినిధ్యం కల్పించినా... ఆ వర్గాల ప్రజలు బీఎస్‌పీని అర్థం చేసుకోలేకపోయారని ఆమె పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఎక్స్‌లో ఆమె బుధవారం ఓ పోస్ట్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం వర్గానికి కల్పించే ప్రాతినిధ్యంపై సుదీర్ఘంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్‌పీ ఖాతా తెరవలేదు. 2019లో ఎస్‌పీతో పొత్తు పెట్టుకుని 10 సీట్లు గెలుచుకుంది. ముస్లిం సామాజిక వర్గం దూరం కావడంపై లోతుగా అధ్యయనం చేయనున్నట్లు మాయావతి తెలిపారు. బీఎస్‌పీలో ముస్లిం సామాజిక వర్గం కీలకమైందని, కానీ తమ పార్టీని సరైన రీతిలో ముస్లింలు అర్థం చేసుకోలేకపోయినట్లు ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ సామాజిక వర్గానికి రాజకీయంగా పార్టీ తరపున ఇచ్చే సీట్లు ఇచ్చే అవకాశాలపై ఆచితూచి వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల మాదిరిగా భవిష్యత్తులో నష్టం జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

సీనియర్ నేతల ఓటమి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల సమరం ముగిసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోంది. మెజారిటీ 272 సీట్లుకాగా ఎన్‌డీయే కూటమి ఇప్పటికే 292 సీట్లలో గెలుపొందింది. అయితే ఎన్‌డీయే అభ్యర్థుల్లో చాలామంది స్వల్ప మెజారిటీతో ఓడిపోగా...మరి కొందరు భారీ మెజారిటీతో ప్రత్యర్థుల చేతిలో ఓటమి చవి చూశారు. 2019 ఎన్నికల్లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓడిపోయారు. అదే నియోజకవర్గంలో ఇప్పుడు కాంగ్రెస్ నేత కిశోరీ లాల్ శర్మ చేతిలో 1.5 లక్షల ఓట్ల తేడాతో ఘోర పరాజయం చవి చూశారు. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం శర్మకు 5,39,228 ఓట్లు రాగా... ఇరానీకి 3,72,032 ఓట్లు వచ్చాయి.

యూసఫ్ పఠాన్ చేతిలో అధీర్ రంజన్

పశ్చిమ బెంగాల్‌లోని బహరంపూర్ స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ టికెట్‌పై మొదటిసారి పోటీ చేసిన మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ సీనియర్ కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరిని ఓడించారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ నుంచి కేంద్ర మంత్రి అజయ్ కుమార్ తేని ఎస్‌పీ అభ్యర్థి ఉత్కర్ష్ వర్మ మధుర్‌పై 34,329 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌పై కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఓటమి పాలయ్యారు. థరూర్ 16 వేల మెజారిటీతో గెలుపొందారు. సుల్తాన్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి మేనకా గాంధీపై ఎస్పీ అభ్యర్థి రాంభూల్ నిషాద్ 43,174 ఓట్ల తేడాతో విజయం సాధించారు. జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి షేక్ అబ్దుల్ రషీద్ చేతిలో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ఓటమి చెందారు. దక్షిణాదిపై పట్టు నిలుపుకుందామనుకున్న బీజేపీకి గట్టి ఎదురు దెబ్బే తగిలింది. బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై కుప్పుసామి కోయంబత్తూరులో డీఎంకే అభ్యర్థి గణపతి రాజ్‌కుమార్‌పై 1,18,068 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

బీజేపీ పుట్టి ముంచిన యూపీ

80 సీట్లకుగాను 33తో సరి...

బుందేల్‌ఖండ్‌లో భారీ ఎదురుదెబ్బ

లక్నో: బీజేపీకి ఉత్తరప్రదేశ్‌లో భారీ ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి. గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి దాదాపు సగం మంది మాత్రమే పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వెనుకబడిన బుందేల్‌ఖండ్ ప్రజలు ఈసారి కాషాయ పార్టీని తీవ్రంగా తిరస్కరించారు. రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాలు సాధారణంగా ఆరు ప్రాంతాలలో విభజించబడ్డాయి. పశ్చిమ ఉత్తర ప్రదేశ్, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్, అవధ్, బ్రజ్, రోహిల్‌ఖండ్. 2019లో యూపీ నుంచి 80 సీట్లలో 62 సీట్లు గెలుచుకుని స్పష్టమైన తీర్పుతో అధికారాన్ని చేజిక్కించుకున్న బీజేపీ... ఈసారి 33 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఆ పార్టీలో రాజకీయ పోస్టుమార్టం ఇంకా జరుగుతోంది. మతపరమైన ఆవేశపూరిత వాక్చాతుర్యం, 'రామభక్తులు', 'రామ ద్రోహుల' మధ్య వ్యత్యాసాన్ని, దేవాలయం పేరుతో ఓటు వెతకడం వంటి ఆవేశపూరిత ప్రచారం జరిగినప్పటికీ పార్టీ సీట్లు సగానికి సగం తగ్గిపోయాయి. యూపీలోని 80 సీట్లు ఈ విధంగా ఉన్నాయి. పశ్చిమ యూపీ-10, బ్రజ్-8, అవధ్-20, రోహిల్‌ఖండ్-11, బుందేల్‌ఖండ్-5, పూర్వాంచల్-26. పశ్చిమ యూపీలో సహారన్‌పూర్, కైరానా, ముజఫర్‌నగర్, బిజ్నోర్, నగీనా, అమ్రోహా, మీరట్, బాగ్‌పట్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్‌లతో కూడిన ప్రాంతంలో బీజేపీ నాలుగు స్థానాలను గెలుచుకుంది. 2019తో పోలిస్తే ఆరు స్థానాలకు తగ్గింది. దాని మిత్రపక్షమైన ఆర్ఎల్‌డీ రెండు స్థానాలను గెలుచుకుంది. అమేథీ, రాయ్‌బరేలీ, లక్నో వంటి కీలక నియోజకవర్గాలను కలిగి ఉన్న అవధ్‌లోని 20 స్థానాల్లో బీజేపీ తొమ్మిది మాత్రమే గెలవగా, సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్ ఏడు, నాలుగు స్థానాలను గెలుచుకున్నాయి. కొత్తగా నిర్మించిన రామాలయం నగరమైన ఫైజాబాద్ నుంచి ఈ ప్రాంతంలో అతిపెద్ద దెబ్బ తగిలింది. ఇది రాముడి పేరుతో పార్టీ పెద్ద ఎత్తున ప్రచారం చేసినప్పటికీ బీజేపీ అభ్యర్థి విజయం సాధించలేకపోయాడు. పార్టీకి చెందిన పెద్ద నాయకులైన మేనకా గాంధీ, స్మృతి ఇరానీ సుల్తాన్‌పూర్, అమేథీని కోల్పోయారు. ఇరానీ ఓటమి పార్టీని మరింత దెబ్బతీసినట్లు అనిపించింది. లక్నోలో రాజ్‌నాథ్ సింగ్ గెలుపు మార్జిన్ కూడా 2019లో 3.47 లక్షల నుంచి 1.5 లక్షలకు తగ్గింది. రోహిల్‌ఖండ్ ప్రాంతం... దాని 11 సీట్లలో బుదౌన్, బులంద్‌షహర్ పార్టీకి ఎటువంటి సహాయాన్ని అందించలేదు. అక్కడి నుంచి నాలుగు సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇది గతసారి తొమ్మిది స్థానాల నుంచి తగ్గింది. 2021లో జరిగిన నిరసన ర్యాలీలో భాగంగా రైతులను హత్య చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా టెనీ ఈ ప్రాంతంలోని ఖేరీ స్థానం నుంచి ఓడిపోయారు. యూపీలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా పరిగణించబడే బుందేల్‌ఖండ్ బీజేపీకి అత్యంత స్పష్టమైన తీర్పును ఇచ్చింది. ఈ ప్రాంతంలోని ఐదు స్థానాల్లో బీజేపీ ఒకే ఒక్క స్థానం ఝాన్సీని మాత్రమే దక్కించుకోగలిగింది. 2019లో ఈ ప్రాంతంలో పార్టీ మొత్తం ఐదు స్థానాల్లో గెలిచింది. గోరఖ్‌పూర్, అజంగఢ్, మీర్జాపూర్ వంటి కీలక నియోజకవర్గాలు ఉన్న పూర్వాంచల్ ప్రాంతం నుంచి 10 స్థానాలను గెలుచుకుంది. ఇది గతసారి 18 సీట్ల నుంచి తగ్గింది. ప్రధాని నరేంద్ర మోదీ వారణాసి నుంచి హ్యాట్రిక్ సాధించినా, మెజార్టీ 2019లో 4.79 లక్షల నుంచి 1.52 లక్షలకు తగ్గింది. బ్రజ్ (మథుర, హత్రాస్ మొదలైనవి) ప్రాంతం నుంచి అధికార పార్టీ ఐదు స్థానాలను గెలుచుకుంది. ఇది 2019లో ఏడు సీట్ల నుంచి తగ్గింది. తమ పార్టీ పని తీరును సమీక్షిస్తామని బీజేపీ చెప్పినప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రాజ్‌పాల్ కశ్యప్ దీనిని రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, రిజర్వేషన్లను కొనసాగించడానికి ఓటు వేసిన ప్రజల తీర్పు అని పేర్కొన్నారు.

డబుల్ ఇంజిన్ నినాదం గాలికి...

న్యూఢిల్లీ: బీజేపీ పదేపదే వల్లె వేస్తున్న డబుల్ ఇంజిన్ సర్కారుకు ఉత్తరప్రదేశ్‌ను మోడల్‌గా చెబుతున్నారు. యూపీలో మోదీ-యోగీ ద్వయం రాష్ట్రాన్ని ముందుకుతీసుకెళుతోందని గొప్పలు చెప్పుకున్నారు. శాంతిభద్రతలు, అభివృద్ధి, హిందుత్వ అజెండాతో ముందుకెళుతున్నామని కమలం పార్టీ ప్రచారంలో గొప్పగా ప్రచారం చేసుకొంది. కానీ, లోక్‌సభ ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ మొరాయించి ఫలితాలు ఇవ్వలేదు. ఓటమిపై కమలనాథుల్లో అంతర్మథనం మొదలైంది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ బలమైన సోషల్ ఇంజినీరింగ్‌తో ఈసారి ఎన్నికలకు వెళ్లింది. ఈ క్రమంలో 'పీడీఏ' (వెనుకబడిన, మైనార్టీ, దళిత్) వ్యూహంతో ఆ వర్గాల ఓటర్లను ఆకర్షించింది. రాష్ట్రంలో నాలుగు ఎన్నికల్లో విజయానికి యోగి నేతృత్వం వహించారు. 2022 అసెంబ్లీ, 2019 లోక్‌సభ, రెండు స్థానికసంస్థల ఎన్నికలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటిల్లో బీజేపీ విజయాలు సాధించింది. ఈసారి టికెట్ల కేటాయింపుల్లో అభ్యర్థులపై స్థానిక వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీ ఓటమికి అదే బలమైన కారణంగా నిలిచింది. యోగి ఆదిత్యనాథ్ మాత్రం టికెట్ల కేటాయింపును పూర్తిగా కేంద్ర నాయకత్వానికే వదిలేసి...ప్రచార బాధ్యత మాత్రమే యోగి తీసుకొన్నారు. ఆయన రాష్ట్రంలోని 75 జిల్లాల్లో పర్యటించారు. యోగీకి సంబంధించి పార్టీలో గందరగోళం సృష్టించేందుకు ప్రత్యర్థులు చేసిన ప్రయత్నాలను బలంగా తిప్పికొట్టలేకపోవడం సీట్లు కోల్పోవడానికి కారణమైంది. ఎన్నికల వేళ దిల్లీ సీఎం కేజ్రీవాల్ లక్నో వచ్చి...బీజేపీ గెలిచిన తర్వాత యోగిని కూడా ఇతర సీఎంల్లానే తొలగిస్తుందని ప్రచారం చేశారు. మీరు కాషాయదళానికి ఓటేస్తే మీ అభిమాన ముఖ్యమంత్రిని వదులుకొంటారని బలంగా చెప్పారు. ఇది పార్టీ శ్రేణుల్లో గందరగోళానికి దారితీసింది. దీనికి బీజేపీ నుంచి గట్టి కౌంటర్ రాలేదు. ఇది కూడా కొంత నష్టం చేకూర్చిందని నాయకత్వం భావిస్తోంది. రైతులపై ఆర్థిక ఒత్తిడి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య, అగ్నివీర్‌పై ప్రతిపక్ష ప్రచారం వంటి అంశాలను చాలాచోట్ల బీజేపీకి వ్యతిరేకతను తెచ్చాయి. మరోవైపు, యూపీలో ఈసారి మైనార్టీ ఓట్లు గంపగుత్తగా ప్రతిపక్ష పార్టీలకు పడినట్లు తెలుస్తోంది. సుమారు 85 శాతం ముస్లింలు కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీకి ఓటు వేయగా... ఆరు శాతం మాత్రమే బీజేపీ వైపు మొగ్గారు. ఆశ్చర్యమేమంటే...రామాలయం నిర్మించిన అయోధ్య(ఫైజాబాద్)లో బీజేపీ ఓడిపోవడాన్ని పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. బీజేపీకి జీవం పోసిన అయోధ్య ఉద్యమానికి ఓ సానుకూల ముగింపు ఇచ్చినా... ఎస్పీ అభ్యర్థి అవధేష్ ప్రసాద్‌నే విజయం వరించింది. దీంతో ఈ అంశం తమకు ఎన్నికల్లో ఉపయోగపడలేదని పార్టీ అంచనా వేసింది. దీనికితోడు...యూపీలో బీఎస్పీ బలహీనపడటం కూడా కాంగ్రెస్-సమాజ్‌వాదీకి కలిసొచ్చింది. రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్-సమాజ్‌వాదీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ఫలితంగా బీఎస్పీ ఓట్లు వాటికి మళ్లాయి

అందరికంటే ధైర్యవంతుడు

రాహుల్‌ను ప్రశంసించిన ప్రియాంక

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ ధైర్యవంతుడని, ఎప్పుడూ వెనకడుగు వేయలేదని, సత్యం కోసం పోరాడడం ఎప్పుడూ ఆపలేదని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మంచి ప్రదర్శన కనబరిచిన మరుసటి రోజు బుధవారం తన సోదరుడి గురించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎక్స్'లో తన సోదరుడికి హృదయపూర్వక సందేశంలో ప్రియాంక గాంధీ వాద్రా ఇలా అన్నారు. 'మీరు నిలబడి ఉన్నారు, వారు మీకు ఏమి చెప్పినా, చేసినా, మీరు వెనకడుగు వేయలేదు. మీ నమ్మకాన్ని ఎంతగా అనుమానించినా నమ్మడం మానేయలేదు. వారు అబద్ధాలను విపరీతంగా ప్రచారం చేసినప్పటికీ మీరు సత్యం కోసం పోరాడటం ఆపలేదు' అని పేర్కొన్నారు. 'మీరు మీ హృదయంలో ప్రేమ, నిజం, దయతో పోరాడారు. మిమ్మల్ని చూడలేని వారు ఇప్పుడు మిమ్మల్ని చూస్తున్నారు. కానీ మాలో కొందరు ఎల్లప్పుడూ మిమ్మల్ని అందరికంటే ధైర్యవంతుడని చూశారు' అని ఆమె మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడి గురించి అన్నారు. 'భాయ్ ఏ రాహుల్ గాంధీ, నేను మీ సోదరి అయినందుకు గర్వపడుతున్నాను' అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

బాధ్యతాయుత పాలన అందిస్తాం

జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: 'ప్రజలు మనల్ని బలంగా నమ్మి కనీవినీ ఎరుగని విజయాన్ని అందించారు. మనకు వచ్చిన ప్రతీ ఓటు మనకు బాధ్యతను గుర్తు చేసేది. అయిదు కోట్ల మందికీ జవాబుదారిగా ఉండాలి' అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో విజేతలుగా నిలిచిన పార్టీ అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ప్రజల కష్టం నుంచి పన్నులు కట్టే సొమ్మును ఓ ప్రజా ప్రతినిధిగా జీతం రూపంలో బాధ్యతగా తీసుకుంటాను. ఎందుకంటే ప్రజలు మా పన్నుల ద్వారా వచ్చిన డబ్బును జీతంగా తీసుకుంటున్నావు... మాకు పనులు ఎందుకు చేసి పెట్టవని అడగడానికి వారికి అజమాయిషీ ఉంటుంది. నాకు కూడా ప్రజల డబ్బులు జీతంగా తీసుకుంటున్నాననే బాధ్యత నిరంతరం ఉంటుంది. ప్రజలకు అన్ని కష్టాల్లో అండగా నిలుస్తాను' అని తెలిపారు. శాసనసభ సమావేశాలుగానీ, ప్రజాప్రతినిధుల మాటలుగానీ టీవీల్లో చూస్తున్నప్పుడు భావితరాల వారు వాటిని స్ఫూర్తిగా తీసుకునేలా జనసేన నాయకులు మాట్లాడాలి, నడుచుకోవాలన్నారు. రాజకీయాలను కెరీర్ చేసుకోవాలనే స్ఫూర్తిని యువతలో నింపేలా జనసేన ముందుకు సాగుతుందని చెప్పారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కనీవినీ ఎరుగనిరీతిలో జనసేనను ఆశీర్వదించారని, సమస్యల పరిష్కారానికి పార్టీ ఏ విధంగా నిలబడుతుందో చేసి చూపుదామన్నారు. ప్రతి సీటు విజయం సాధించాలన్న పట్టుదలతో పవన్ తీసుకున్న నిర్ణయం గర్వించదగ్గ అంశమన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ ఒక పార్టీ 100 శాతం విజయం దేశంలో ఎక్కడా వినలేదన్నారు. 21 మంది గెలుపు వెనుక 17 సంవత్సరాల అధ్యక్షుల వారి శ్రమ దాగి ఉందని తెలిపారు. పిఠాపురంలో పని చేసిన 45 రోజులు ఎంతో నేర్చుకున్నామన్నారు.

ఆ ఐదు స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఘనత ఖర్గేదే...

బెంగళూరు: కల్యాణ-కర్నాటక పరిధిలోని ఐదు ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ గెలుపుతో ఇదే రాష్ట్రానికి చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విలువ మరింత పెరిగింది. పార్టీ అభ్యర్థుల విజయానికి ఘనత లభించింది. 2019 ఎన్నికల్లో బీదర్, గుల్బర్గా, రాయ్‌చూర్, కొప్పల్, బళ్లారి స్థానాల్లో కాంగ్రెస్ ఓటమని చవిచూసింది. గుల్బర్గా నుంచి పోటీ చేసిన ఖర్గే సైతం గెలవలేదు. ఈసారి ఆ ఐదు స్థానాల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసింది. బీదర్‌లో మంత్రి ఈశ్వర్ ఖండ్రే కుమారుడు సాగర్ 1,28,875 ఓట్ల తేడాతో కేంద్రమంత్రి భగవంత్ ఖుబాపై గెలుపొందారు. గుల్బర్గాలో ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి 27,205 ఓట్లతో ఎంపీ ఉమేశ్ జాధవ్ (బీజేపీ)ని ఓడించారు. రాయ్‌చూర్‌లో మాజీ ఐఏఎస్ జి.కుమార్ నాయక్ గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర నాయక్‌ను 79,781 ఓట్లతో ఓడించారు. కొప్పల్‌లో బీజేపీ అభ్యర్థి బసవరాజ్ కె శరణప్పపై 46,357 ఓట్లతో రాజశేఖర్ హిత్నల్ గెలుపొందారు. బళ్లారీలో మాజీ మంత్రి ఇ.తూకారాం 98,992 ఓట్లతో బీజేపీ ఎస్టీ నేత, మాజీ మంత్రి బి.శ్రీరాములును ఓడించారు. గతంలో ఈ ప్రాంతాన్ని హైదరాబాద్-కర్నాటకగా వ్యవహరించేవారు. ఇది కాంగ్రెస్ కుంచుకోటగా ఉండేది. 2009లో బళ్లారి రెడ్డీ సోదరుల సాయంతో రాయ్‌చూర్, కొప్పల్, బళ్లారి స్థానాలను బీజేపీ గెలుచుకుంది. గుల్బర్గా, బీదర్‌లో కాంగ్రెస్ గెలిచింది. 2014 ఎన్నికల్లో గుల్బర్గాలో ఖర్గే, రాయ్‌చూర్‌లో బీవీ నాయక్ గెలువగా మిగిలిన మూడు స్థానాలు బీజేపీకి దక్కాయి. 2019 ఎన్నికల్లో ఐదు స్థానాలను బీజేపీ గెలుచుకుంది. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం దక్కింది. ఒకప్పటి కుంచుకోటలో విజయకేతనాన్ని ఎగురవేయగలిగింది. ఇందుకు ఘనత ఖర్గేకు దక్కింది. ఈ ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని ఖర్గే విస్తృతంగా సాగించారు. అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆయా జిల్లాల కోసం చేసినదాని గురించి ప్రజలకు వివరించారు. హైదరాబాద్-కర్నాటక ప్రస్తుతం కల్యాణ-కర్నాటకగా మారింది. ఇక్కడి వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా కల్పించే అధికరణ 371 (జే) అమలు చేసింది తామేనని స్థానికులకు ఖర్గే గుర్తుచేశారు. స్వరాష్ట్ర ప్రజల నాడిని తెలుసుకుని ప్రచారాన్ని సాగించారు. ఐదు స్థానాల్లో కాంగ్రెస్ గెలుపునకు దోహదమయ్యారు. మరోవైపు అంతర్గత పోరు కారణంగా ఆయా స్థానాల్లో బీజేపీ చిత్తు అయినట్లు తెలిసింది.

చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి... పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

కేజ్రీవాల్‌కు దక్కని బెయిల్

న్యూఢిల్లీ: మధ్యంతర బెయిల్ కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు మధ్యంతర బెయిల్ పొడిగించాలని కేజ్రీవాల్ అభ్యర్థన చేసుకున్న సంగతి తెలిసిందే. దానిపై ఇప్పటికే వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు నేటికి వాయిదా వేసింది. ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. జూన్ 19 వరకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించింది. జైలు అధికారులు ఆయన వైద్య అవసరాలు చూసుకోవాలని కోర్టు ఆదేశించింది. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ... కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జూన్ 2న తిరిగి జైలులో లొంగిపోయారు. ఆయన ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.

ఆ ఎంపీలు లోక్‌సభకు వెళ్లొచ్చా?

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో 18వ లోక్‌సభలో అడుగుపెట్టే 543 మంది ఎంపీలు ఎవరో తేలిపోయింది. వీరిలో రాజకీయ ఉద్దండులు, తొలిసారి ఎన్నికైనవారు, అనేక రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. వీరందరినీ పక్కనబెడితే కొత్తగా ఎన్నికైన వారిలో ఇద్దరి గెలుపు ఆశ్చర్యపర్చింది. వారు జైలు నుంచే ఎన్నికల్లో పోటీ చేయడమే కాకుండా విజయం సొంతం చేసుకున్నారు. వారే అమృత్‌పాల్ సింగ్, ఇంజినీర్ రషీద్. పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ స్థానం నుంచి వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్, జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా నుంచి ఉగ్రనిధుల కేసు నిందితుడు ఇంజినీర్ రషీద్ తాజా లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు. ప్రస్తుతం వీరిద్దరూ జైల్లో ఉండటంతో ఎంపీగా ప్రమాణస్వీకారం చేసేందుకు అనుమతిస్తారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే, రాజ్యాంగ నిబంధనల ప్రకారం వీరు ప్రమాణం చేసేందుకు అర్హులేనని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్, రాజ్యాంగ నిపుణులు పీడీటీ ఆచారి తెలిపారు. 'ఇలాంటి కేసుల్లో రాజ్యాంగ నిబంధనలు పాటించడం అత్యంత అవశ్యం. ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి చట్టసభ్యుడిగా ప్రమాణం చేయడం రాజ్యాంగపరమైన హక్కు. అయితే, ప్రస్తుతం వీరిద్దరూ జైల్లో ఉన్నందున ప్రమాణస్వీకారం కోసం పార్లమెంట్‌కు తీసుకెళ్లేందుకు అధికారుల నుంచి అనుమతి పొందాలి. ప్రమాణం పూర్తయిన తర్వాత తిరిగి జైలుకు వెళ్లాలి' అని ఆచారి వెల్లడించారు. అయితే, జైల్లో ఉన్న వ్యక్తులు సభా కార్యకలాపాలకు హాజరయ్యేందుకు చట్టం అనుమతించదు. అందువల్ల ఎంపీగా ప్రమాణం చేసిన తర్వాత వారు సభకు హాజరుకాలేకపోవడంపై స్పీకర్‌కు లేఖ రాయాల్సి ఉంటుంది. వారి అభ్యర్థనలను సభాపతి సభ్యుల గైర్హాజరీపై ఏర్పాటైన హౌస్ కమిటీకి పంపుతారు. ఈ అభ్యర్థులను అంగీకరించాలా? వద్దా అన్నదానిపై కమిటీ సిఫార్సు చేస్తుంది. వాటిపై సభలో ఓటింగ్ నిర్వహించి నిర్ణయం తీసుకుంటారని ఆచారి తెలిపారు. ఇక, ఇంజినీర్ రషీద్‌గా గుర్తింపు పొందిన షేక్ అబ్దుల్ రషీద్.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో అరెస్టయ్యారు. తాజా ఎన్నికల్లో బారాముల్లా స్థానం నుంచి స్వతంత్రుడిగా పోటీ చేసి...మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాపై 2 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ కేసుల్లో వారు దోషులుగా తేలి రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష ఎదుర్కొంటే... ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజ్యాంగ పదవుల్లో ఉండటానికి అనర్హులవుతారు. అప్పుడు లోక్‌సభ సభ్యత్వం కోల్పోతారు. జైలుశిక్ష కాలంతో పాటు మరో ఆరేళ్లు ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుండదు.

ఒడిశా కొత్త సీఎంపై త్వరలో నిర్ణయం: బీజేపీ

భువనేశ్వర్: ఒడిశాకు కాబోయే ముఖ్య మంత్రి ఎవరన్నది ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తామని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సమల్ తెలిపారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు దీనిపై నిర్ణయిస్తుందన్నారు. మన్మోహన్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జూన్ 10న ఒడిశాలో బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారం చేస్తారని బెర్హంపూర్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ చెప్పారని గుర్తుచేశారు. ప్రధాని కోరుకునే అర్హతలు ఉన్నవారినే ముఖ్యమంత్రి పీఠం వరిస్తుందని, రాష్ట్ర సంప్రదాయం, ఆచారాలకు కట్టుబడే స్థానికుడే సీఎం కాగలరన్నారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీలన్నీ అమలవు తాయని, ఒడియా ప్రతిష్ఠ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసమే అసెంబ్లీ పోరు సాగిందని చెప్పారు. 24ఏళ్ల బీజేడీ పాలనకు బీజేపీ ముగింపు పలికింది. 147 మంది సభ్యుల అసెంబ్లీలో 74 స్థానాలు గెలుచు కుంది. ముఖ్య మంత్రి రేసులో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండా, భువనేశ్వర్ ఎంపీ అపరాజితా సారంగి, బాలాసోర్ ఎంపీ ప్రతాప్ సారంగి ఉన్నారని ఊహాగానాలు ఉన్నాయి.

రాహుల్ అంగీకరిస్తే ప్రధాని అభ్యర్థి ఆయనే: రౌత్

న్యూఢిల్లీ: పరిస్థితి అనుకూలిస్తే ఇండియా ఐక్యసంఘటన తరపున ప్రధానిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రతిపాదించేందుకు అభ్యంతరం లేదని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తెలిపారు. 'నాయకత్వ బాధ్యతలు స్వీకరించేందుకు రాహుల్ గాంధీ అంగీకరిస్తే మేమెందుకు అభ్యంతరం చెబుతాం? జాతీయ నాయకుడిగా ఆయన తన సామర్థ్యాన్ని అనేకసార్లు రుజువు చేసుకున్నారు. ప్రజాదరణగల నాయకుల్లో ఒకరిగా ఉన్నారు. ఆయనను మేమూ ప్రేమిస్తాం... అభిమానిస్తాం. రాహుల్‌కు ప్రధాని పదవి ఇవ్వడంపై మిత్రపక్షాల్లోనూ వ్యతిరేకత లేదు' అని రౌత్ బుధవారం ముంబైలో విలేకరులతో అన్నారు. ప్రధాని విషయంలో ముందు నుంచి ఇండియా ఐక్యసంఘటనలో విభేదాలు లేవని చెప్పారు. బీజేపీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా... ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం 'ఇండియా' పోరాడిందని రౌత్ తెలిపారు. ప్రజలు కూడా తమకు ఓట్లు వేశారని చెప్పారు. నరేంద్రమోదీ, అమిత్‌షా ఓటమిని అంగీకరించాలన్నారు. ఎన్డీయేకు టీడీపీ, జేడీయూ మద్దతివ్వడంపై స్పందిస్తూ 'టీడీపీ, జేడీ(యూ) ఆధారంగా ఏర్పాటయ్యే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు' అని రౌత్ అన్నారు. 'మోదీ బ్రాండ్' పనైపోయిందని, ఇటువంటి ప్రధానిని దేశం కోరుకోవడంలేదని చెప్పారు. కలిసివస్తామంటే జేడీ(యూ), టీడీపీని 'ఇండియా' స్వాగతిస్తుందని తెలిపారు. ఈ పార్టీ అధ్యక్షులు ప్రజాస్వామ్య సమర్థకులన్నారు. 'బీజేపీకి మెజారిటీ రాలేదు. చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ నియంత పాలనకు బదులు ప్రజాస్వామిక వ్యవస్థలో పనిచేయాలని నిర్ణయించుకోలేరా? ఈ ఇద్దరు ఎప్పుడూ ప్రజాస్వామ్యం పక్షాన్నే నిలిచారు. ఇప్పుడు కూడా నిరంకుశత్వానికి మద్దతిస్తారని అనుకోవడం లేదు' అని రౌత్ అన్నారు.

25 ఏళ్లకే లోక్‌సభకు

నలుగురు యువ ఎంపీల్లో ముగ్గురు యువతులు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి పార్లమెంటులో అడుగు పెట్టేందుకు నలుగురు యువనాయకులు సిద్ధమయ్యారు. 25 ఏళ్లకే ఎంపీలయ్యారు. వీరిలో ముగ్గురు యువతులు ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి పుష్పేంద్ర సరోజ్, ప్రియా సరోజ్, లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) తరపున శాంభవి చౌదరి, కాంగ్రెస్ నుంచి సంజనా జాతవ్ లోక్‌సభకు ఎన్నికయ్యారు.

పుష్పేంద్ర సరోజ్

పుష్పేంద్ర సరోజ్ సమాజ్‌వాదీ పార్టీ తరపున కౌశంబీ పార్లమెంటు స్థానం నుంచి ఎన్నికయ్యారు. బీజేపీ ఎంపీ, సమీప అభ్యర్థి వినోద్ కుమార్ సోంకర్‌పై 1,03,944 ఓట్లతో గెలిచారు. ఐదు సార్లు ఎమ్మెల్యే, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి ఇందర్‌జిత్ సరోజ్ కుమారుడే పుష్పేంద్ర.

ప్రియా సరోజ్

ప్రియా సరోజ్ సమాజ్‌వాదీ పార్టీ తరపున యూపీలోని మఛిలీషెహర్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 35,850 ఓట్ల తేడాతో సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి భోలానాథ్‌ను ఓడించారు. ఈమె తండ్రి తూఫానీ సరోజ్ గతంలో మూడుసార్లు ఎంపీగా ఎన్నియ్యారు.

సంజనా జాతవ్

రాజస్థాన్‌లోని భరత్‌పూర్ నుంచి సంజనా జాతవ్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన ఈమె తన సమీప ప్రత్యర్థి... బీజేపీ అభ్యర్థి రామ్‌స్వరూప్ కోలీపై 51,983 ఓట్లతో గెలుపొందారు. 25 ఏళ్లకే లోక్‌సభలో అడుగు పెట్టబోతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓడిపోయారు. ఆమెపై 409 ఓట్లతో బీజేపీ అభ్యర్థి రమేశ్ ఖేదీ గెలిచారు. రాజస్థాన్ పోలీసు కానిస్టేబుల్ కప్తాన్ సింగ్‌తో సంజనా జాతవ్‌కు వివాహం జరిగింది.

శాంభవి చౌదరి

బీహార్‌లో నితీశ్ కేబినెట్ మంత్రి అశోక్ చౌదరి తనయ. సమస్తిపుర నియోజకవర్గం నుంచి లోక్ జనశక్తి పార్టీ తరపున పోటీ చేశారు. తన సమీప అభ్యర్థి, జేడీ(యూ) మంత్రి మహేశ్వర్ హజారీ కుమారుడు సన్నీ హజారీపై సులువుగా గెలుపొందారు. ఎన్డీయేలోని అతి పిన్నవయస్సు అభ్యర్థిగా శాంభవిని మోదీ ప్రశంసించారు. ఆమె తరపున ప్రచారం చేశారు.

ఓపిక పట్టండి... జరిగేది చూస్తుండండి

మీడియాతో తేజస్వి ఆసక్తికర వ్యాఖ్యలు

ఒకే విమానంలో నితీశ్‌తో కలిసి ఢిల్లీ ప్రయాణం

న్యూఢిల్లీ: కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై దేశ రాజధానిలో చర్చలు ఊపందుకున్న తరుణంలో బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ యునైటెడ్ నేత నితీశ్‌కుమార్, రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీయాదవ్ కలిసి ఒకే విమానంలో ప్రయాణించడం రాజకీయవర్గాలను ఆశ్చర్యంలో ముంచెత్తింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఇద్దరూ పాట్నా నుంచి విస్తారా విమానంలో ఢిల్లీకి బయలుదేరడం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. కొద్ది నెలల క్రితం వరకూ బీహార్‌లో జేడీయూ, ఆర్జేడీ కూటమి ప్రభుత్వం నడిచింది. నితీశ్‌కు డిప్యూటీగా (ఉప ముఖ్యమంత్రి) తేజస్వి పనిచేశారు.ఆ తర్వాత నితీశ్ 'యూ-టర్న్' తీసుకుని బీజేపీతో చేతులు కలిపి తిరిగి సీఎంగా పాలన కొనసాగించారు. ఈసారి ఎన్డీయేను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టే ప్రసక్తే లేదని నితీశ్ వివిధ వేదికలపై సైతం గట్టిగానే చెప్పారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుతో పోటీ చేసిన జేడీయూ 12 సీట్లు కూడా కైవసం చేసుకుంది. అయితే ఎన్నికల ఫలితాలకు ముందు తేజస్వి చేసిన వ్యాఖ్యలు మళ్లీ నితీశ్ పార్టీ మారే అవకాశాలున్నాయనే సంకేతాలనిచ్చారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత నితీశ్ చాలా పెద్ద నిర్ణయమే తీసుకోనున్నారంటూ తేజస్వి వ్యాఖ్యానించడంతో రాష్ట్రంలో తిరిగి రెండు పార్టీలు కలిసే అవకాశాలున్నాయనే సంకేతాలు వెళ్లాయి. ఈ క్రమంలో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఎన్డీయే, 'ఇండియా' కూటమి కీలక సమావేశాల కోసం ఇరువురూ ఢిల్లీకి బయలుదేరడం, ఒకే విమానంలో ప్రయాణించడం మరోసారి ఆసక్తికర చర్చకు తెరలేపింది. ఈ క్రమంలో నితీశ్‌తో కలిసి ఒకే విమానంలో ప్రయాణించడం, ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలపై తేజస్విని మీడియా ప్రశ్నించగా...ఆయన ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'నితీశ్... నేనూ ఒకరినొకరు అభినందించుకున్నాం. ఆ తర్వాత ఏం జరుగుతుందనే దానిపై ఓపిక పట్టండి. జరిగేది చూస్తుండండి' అని సమాధానమిచ్చారు. ఈ ఎన్నికల్లో బీహార్ 'కింగ్‌మేకర్'గా అవతరించింది... కొత్త ప్రభుత్వం బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించేలా హామీ ఇవ్వాలి. తాము ఇచ్చిన 75శాతం రిజర్వేషన్లను షెడ్యూల్ 9కిందకు తీసుకురావాలి. దేశవ్యాప్తంగా కుల గణనను నిర్వహించాలని తేజస్వి తెలిపారు. ఫైజాబాద్‌లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. "మేము అయోధ్యను గెలుచుకున్నాము. ప్రధాని ముస్లింలపై విద్వేషపూరిత ప్రసంగాన్ని ఉపయోగించారు. రామ్ జీ కూడా అతనికి గుణపాఠం నేర్పారు" అని ఆయన అన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడేందుకు, నిరంకుశ పాలనకు గుణపాఠం చెప్పేలా దేశ ప్రజలు ఓటు వేసినందుకు సంతోషిస్తున్నామన్నారు. ఈ దేశ ప్రజలు ద్వేషపూరిత రాజకీయాలను ఇష్టపడరు... గత 10 ఏళ్లలో మోదీ తన పనికి ఎలాంటి లెక్కలు చెప్పలేదు కాబట్టి ప్రజలు గుణపాఠం నేర్పారని ఆయన అన్నారు.

గుజరాత్‌లో రూ.130 కోట్ల కొకైన్ పట్టివేత

గాంధీనగర్: గుజరాత్‌లోని కచ్ తీరంలో రూ.130 కోట్ల విలువైన కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీధామ్ పట్టణంలోని మితి రోహర్ ప్రాంతంలో స్మగ్లర్లు సముద్ర తీరంలో మాదకద్రవ్యాలు దాచి పెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టి 13 ప్యాకెట్ల కొకైన్ పట్టుకున్నారు. దీని విలువ రూ.130 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. వీటిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఇదే ప్రాంతంలో రూ.800 కోట్ల విలువైన 80 కొకైన్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆప్‌కు స్థలంపై నిర్ణయం తీసుకోండి

కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: అన్ని రాజకీయ పార్టీల మాదిరిగానే ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. దీనిపై ఆరు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అన్ని రాజకీయ పార్టీలకు ఢిల్లీలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకునే అధికారం ఉంటుందని న్యాయమూర్తి జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ తెలిపారు. స్థలం అందుబాటులో లేకపోవడం వల్ల కేటాయించలేకపోతున్నామని చెప్పడాన్ని కారణంగా పరిగణించలేమని కోర్టు పేర్కొంది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి కార్యాలయానికి భూమి కేటాయించాలని ఆదేశించింది. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీగా గుర్తింపు పొందడంతో ఢిల్లీలో తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయించాలని గతంలో కేంద్రాన్ని కోరింది. జూన్ 15లోగా పార్టీ ప్రస్తుత కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సి ఉందని, వీలైనంత త్వరగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్(డీడీయూ మార్గ్)లోని మంత్రిత్వ శాఖల వద్ద కొంత భాగాన్ని తాత్కాలికంగా కార్యాలయ ఏర్పాటుకు కేటాయించాలని ఆప్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. ప్రస్తుత ఆప్ కార్యాలయం ఉన్న భూమిని ఢిల్లీ హైకోర్టుకు కేటాయించినట్లు మార్చిలో పేర్కొన్న సుప్రీం కోర్టు... ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయడానికి ఆప్‌నకు జూన్ 15 వరకు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే.

నితీశ్, చంద్రబాబు విలువలకు కట్టుబడాలి: సిబల్



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావలసిన మెజారిటీ సాధించడంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విఫలమైంది. దీంతో మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. తాజా ఎన్నికల్లో ఎన్డీయేలో చేరిన టీడీపీ, జేడీ(యూ) అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ కింగ్‌మేకర్లుగా అవతరించారు. గతంలో బీజేపీని విమర్శించిన వారు నేడు అదే పార్టీకి వంత పాడటాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారు. రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ బుధవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ నితీశ్, చంద్రబాబు నాయుడు తమ విలువలకు కట్టుబడతారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రులుగా ఫెడరల్ వ్యవస్థను గౌరవించిన వీరిద్దరు ఇప్పుడు కూడా తమ విలువలతో రాజీ పడరని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించలేదని, రాష్ట్రాల అనుమతి లేకుండా ఈడీ, సీబీఐ చేస్తున్నది ఆక్షేపణీయమని గతంతో నాయుడు అన్నారని సిబల్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రులుగా వీరిద్దరూ తమ విలువల విషయంలో రాజీ పడలేదని, అందుకోసం ఇద్దరికీ సెల్యూట్ చేస్తానన్నారు. ఇప్పుడ కూడా వారి నుంచి తాను ఆశించేదని అదేనని సిబల్ అన్నారు.

భారీ వర్షాలకు అసోంలో 25కి చేరిన మృతులు

గువహటి: రెమాల్ తుపాన్ కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఈశాన్య రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. భారీ వర్షాలకు అసోంలో మరణించిన వారి సంఖ్య 25కు చేరింది. కాఛ్రా జిల్లాలో ఐదుగురు నీటి మునిగి మరణించారు. నాగవ్ జిల్లాలో మహిళ మృతి చెందింది. ఈ మేరకు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ వరదల వల్ల 10 జిల్లాల్లోని మొత్తం 4.23 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని తెలిపింది. 453 గ్రామాలు నీట మునిగి ఉన్నాయని వివరించింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బ్రహ్మపుత్ర, కొపిలి, కుషియారా నదులు పొంగి ప్రవహిస్తున్నాయని పేర్కొంది. దీంతో ఆయా నదీ పరివాహక ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. మరోవైపు ఈ వర్షాలు, వరదలతో తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందని వెల్లడించింది. సహాయక, పునరావాస చర్యలు కొనసాగుతున్నాయని వివరించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.